RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 197 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, జనవరి 29, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 197 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, January, 29 , 2026 | PAGES : 8 RS : 4 /-



## వికసిత్ భారత్ వైపు దేశం

# పయనిస్తోంది

- పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం
- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యం
- వరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ, : దేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్లు కట్టించామని, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. 'పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ...వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించాం. ప్రతి పౌరుడికి జీవిత బీమా కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఆయుష్మాన్ భారత్‌తో కోట్లమందికి వైద్యసేవలందిస్తున్నాం. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెం1 స్థానంలో నిలిచింది. అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజలో ఉందని రాష్ట్రపతి వెల్లడించారు. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని రాష్ట్రపతి అన్నారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జమ్మూకశ్మీర్‌లో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని గుర్తు చేశారు. జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకున్నాం. రూ.12లక్షల వార్షిక ఆదాయం వరకు ఆదాయపు పన్ను లేకుండా చేశాం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. గత 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి చెప్పారు. అవినీతి కట్టడితో ప్రభుత్వ ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోంది.



## మాహారాష్ట్ర రాజకీయాల్లో తీరని

# విషాదం..

## విమాన ప్రమాదంతో డిప్యూటి సిఎం అజిత్ పవార్ దుర్మరణం

**ముంబై,జనవరి28:** మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు.

## ఎంజిఎన్ఆర్ఇజిఎ పునరుద్ధరణకు ప్రజాస్వామ్యయుతంగా పోరాడతాం : కాంగ్రెస్



న్యూఢిల్లీ : యుపిఎ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ చట్టాన్ని (ఎంజిఎన్ఆర్ఇజిఎ) పునరుద్ధరణకు ప్రజాస్వామ్యయుతంగా పోరాడతామని కాంగ్రెస్ పేర్కొంది. ఈ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసేందుకు ప్రతిపలు అన్ని ప్రజాస్వామ్య మార్గాలను వినియోగిస్తాయని తెలిపింది. బుధవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన సంగతి తెలిసిందే. రాష్ట్రపతి ప్రసంగంలో ఎంజిఎన్ఆర్ఇజిఎ బుల్డోజర్ రద్దుకు వ్యతిరేకంగా ప్రతిపలు 'వాపస్ లో (వెనక్కి తీసుకోవాలి)' అంటూ నినాదాలు చేపట్టాయి. రాష్ట్రపతి సూచించిన విబి-జిరామ్‌జి చట్టానికి వ్యతిరేకంగా ప్రతిపలు ఆందోళన చేపట్టాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. విబి-జిరామ్‌జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పనిచేసే హక్కు, పంచాయితీల అధికారం హక్కుల ఆధారిత చట్టంగా దాని అసలు రూపంలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి.

హైదరాబాద్,తెలంగాణ దిశ : ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం మహాజాత రను అత్యంత వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ఆదివాసీఆచార సంప్రదాయాలతోనాలుగు రోజుల పాటు జరిగే ఈ పండుగను వన దేవతల మహో త్సవంగా జరుపుకోవాలని అన్నారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చే ఈ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఘనంగా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా, గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారీగా నిధులు కేటాయించి మేడారంఆలయాన్ని ప్రజా ప్రభుత్వం పునర్నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణతో పాటు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను విశాలంగా నిర్మించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



## సమ్మక్క-సారలమ్మ తల్లుల స్ఫూర్తితో

# రాష్ట్రాభివృద్ధికి

# పునరంకితమవుదాం

మేడారం జాతరపై సీఎం రేవంత్ రెడ్డి..



## అజిత్ విమాన ప్రమాదంలో

# కుట్ర కోణం

## సుప్రీం పర్యవేక్షనలో దర్యాప్తు జరగాలి

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

కోల్‌కతా, : విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. అజిత్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం దేశంలో రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అజిత్ మృతి చెందిన వార్త తనను దిగ్భ్రాంరతికి గురిచేసిందని మీడియాతో మాట్లాడుతూ మమతా బెనర్జీ అన్నారు. బీజేపీని వీడాలని ఆయన ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, రాజకీయ నాయకులకు సైతం భద్రత లేకుండా పోతోందన్నారు.



## జీవన్ రెడ్డిని లైట్ తీసుకుంటున్న

# కాంగ్రెస్

**కరీంనగర్,తెలంగాణ దిశ :** తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త, పాత నేతల మధ్యవార్ ఊపం దుకున్నట్లు కనిపిస్తుంది. అయితే మిగిలిన చోట్ల కొంత నేతలు కామ్ గా ఉన్నప్పటికీ సీనియర్ నేత జీవన్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి పెత్తనం చేసే వారిని ఉపేక్షించడానికి ఇష్టపడటం లేదు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజీవ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన అప్పటి నుంచి తన అసంతృ ప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. అయినా రాష్ట్ర నాయకత్వం కానీ, కేంద్ర నాయకత్వం కానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఇక సమయం వచ్చిన ప్పుడల్లా జీవన్ రెడ్డి తన అసహనాన్ని బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. తాను రాజీ పడేది లేదని జీవన్ రెడ్డి కాంగ్రెస్ నేతలకు హెచ్చరికలు పంపుతున్నారు.కాంగ్రెస్ పార్టీలో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు జీవన్ రెడ్డి ప్రస్తుతం పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గాంధీ భవన్ వేదికగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ నాయకత్వ అహంపై దెబ్బకొడుతున్నాయి. ఒకప్పుడు రేవంత్ రెడ్డికి గట్టి మద్దతుదారుగా నిలిచిన జీవన్ రెడ్డి, నేడు అదే నాయకత్వం తనను విస్మరించడంపై భగ్గుమంటున్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన తన వంటి సీనియర్లను గౌరవించడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమైందనే భావన ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి అసంతృప్తి మాత్రమే కాదు, పార్టీ అంతర్గత క్రమశిక్షణకు జరుగుతున్న పెద్ద డ్యామేజ్.జీవన్ రెడ్డి ఆగ్రహానికి ప్రధాన కారణం ఆయన సొంత నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు. జగిత్యాలలో ఆయన ఎవరిపైన దశాబ్దాలుగా పోరాటం చేశారో,..

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** 'పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలన్నట్టు' గులాబీపార్టీ పుర ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. చేజారిన పుర పాలన పగ్గాలను తిరిగి సాధించుకోవడం కోసం మాస్టర్ ప్లాన్‌తో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ రంగంలోకి దూకుతుంది. మున్సిపాలి టీలోని 34 వార్డుల్లో బలమైనా, ప్రజల్ని ప్రభావితం చేసే యువకులను అభ్యర్థులుగా పోటీ లోకి దింపనున్నట్లు సమాచా రం. 2023 శాసనసభ ఎన్నికల్లో పరా భవానికి గురైనబీఆర్ఎస్ స్థానిక ఎన్ని కలను పూర్వవైభవం తెచ్చుకోవ డాని కి ప్రతిష్టాత్మకంగా భావి స్తున్న దనీ విశ్లేషకులు అంటున్నారు. స్థానిక ఎన్నికలు సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికల అంకంతో స్థానిక పోరు మొదలైంది. దాని కొనసాగింపుగా.. మరో స్థానిక ఎన్నికలు రానే వచ్చాయి. పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సాధించిన ఫలితాలు, అధికార పార్టీకి ఇచ్చిన గట్టి పోటీ రాజకీయం భవిష్యత్తుకు ఆశాజనకంగా గులాబీ శ్రేణులు భావిస్తున్నారు.




## పట్టు కోసం గులాబీ

# ఎత్తులు

# పోరాటాల ద్వారానే పాత్రికేయుల హక్కుల సాధన

## - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య - ఘనంగా నాగర్ కర్నూల్ జిల్లా మహాసభ





**నాగర్ కర్నూల్, జనవరి 28, (తెలంగాణ దిశ) :**జర్నలిస్టుల హక్కుల సాధన పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ నాగర్ కర్నూలు జిల్లా నాలుగవ మహాసభ అమ్రాబాద్ మండలం మననూరులో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన మామిడి సోమయ్య మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్రం వచ్చినా, ప్రభుత్వాలు మారినా, జర్నలిస్టుల సమస్యలు మాత్రం తీరడం లేదని అన్నారు. జర్నలిస్టుల న్యాయమైన హక్కులు కల్పించడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జర్నలిస్టులకు నేటికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందలేదని,పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు ఎలాంటి షరతులు విధించకుండా అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా రావలసిన హక్కులను పోరాటం చేసి సాధించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ జర్నలిస్టులు అనేక సమస్యలతో పోరాటం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం సంఘటితం కావాలని సూచించారు. త్వరలో రాష్ట్ర మహాసభలను హైదరాబాద్ లో నిర్వహించడం జరుగుతుందని, అందుకు జర్నలిస్టులంతా సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కో–కన్వీనర్లు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు తదితరులు పాల్గొన్నారు.

### టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్టు, ధూమర్ల భాస్కర్, కార్యదర్శిగా రవికాంత్ పులిజాల, కోశాధికారిగా బోడ పాండు, ఉపాధ్యక్షులుగా నాగయ్య, సహాయ కార్యదర్శి మంత్రాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రాజేష్, శివ కృష్ణ, సునీత, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పద్మనాభరావు, చారకొండ బాలకృష్ణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా ప్యాట ఆనందం తదితరులు ఎన్నికయ్యారు.



# తొలి రోజు మూడు మున్సిపాలిటీలలో 29 నామినేషన్లు దాఖలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 28, (తెలంగాణ దిశ) :** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో బుధవారం తొలిరోజు 68 వార్డులకు గాను 29 నామినేషన్లు దాఖలైన ట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులకు గాను 16 నామినేషన్లు, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు గాను నాలుగు నామినేషన్లు, మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు గాను 9 నామినేషన్లు దాఖలు అయినట్లు వివరించారు. ఇందులో బిజెపి 8, కాంగ్రెస్ 15, టిఆర్ఎస్ 8 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటితోపాటు గుర్తింపు పొందిన పార్టీల నుంచి మరో రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

# అద్భుతమైన ఫోటో తీశా.. ఫ్రీ టికెట్ ఇవ్వాలన్న ప్రయాణికుడు..

- విమానం నుంచి రోమ్ నగరాన్ని ఫోటో తీసిన ప్రయాణికుడు
- అద్భుతమైన ఫోటోకు ఫ్రీ టికెట్ ఇవ్వాలని ర్యాన్ ఎయిర్‌ను కోరిన వ్యక్తి
- 'నో' అంటూ ఒకే ఒక్క పదంతో సమాధానమిచ్చిన విమానయాన సంస్థ



సోషల్ మీడియాలో సరదాగా చేసే పోస్టులు కొన్నిసార్లు ఊహించని రీతిలో వైరల్ అవుతుంటాయి. తాజాగా ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ ర్యాన్ ఎయిర్ విషయంలో ఇదే జరిగింది. ఓ ప్రయాణికుడు అడిగిన ప్రశ్నకు ఆ సంస్థ ఇచ్చిన సమాధానం ఇప్పుడు నెట్టింట నవ్వులు పూయిస్తోంది. ఓ ప్రయాణికుడు ర్యాన్ ఎయిర్ విమానంలో ప్రయాణిస్తూ ఆకాశం నుంచి రోమ్ నగరం అందంగా కనబడుతున్న ఫోటో తీశాడు. ఆ ఫోటోను 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేస్తూ "హే ర్యాన్ ఎయిర్ మీ విమానం నుంచి రోమ్ నగరాన్ని ఫోటో తీశాను. ఈ అదుతేమైన ఫోటోకు బదులుగా నాకు ఒక ఫ్రీ టికెట్ ఇస్తారా?" అని ట్యాగ్ చేశాడు. సాధారణంగా ఇలాంటి పోస్టులకు సంస్థలు స్పందించవు లేదా మర్యాదపూర్వకంగా బదులిస్తాయి. కానీ, ర్యాన్ ఎయిర్ ఇందుకు భిన్నంగా స్పందించింది. పొడవైన వివరణలు ఇవ్వకుండా సింపుల్‌గా 'నో' అని ఒకే ఒక్క పదంతో సమాధానమిచ్చింది. ఈ సూటి రిప్లై క్షణాల్లో వైరల్ అయింది. నెటిజన్లు ఫన్నీ కామెంట్లతో హోరెత్తించారు. "వాళ్లు చెప్పిన 'నో' భలే నచ్చింది" అని ఒకరు కామెంట్ చేయగా, "వాళ్లు లగేజీలో ఒక్క కిలో కూడా ఉచితంగా ఇవ్వరు, అలాంటిది ఫ్రీ టికెట్ ఇస్తారా?" అని మరొకరు చమత్కరించారు. "ప్రతిరోజూ వేలాది మంది ఇలా విమానం నుంచి ఫోటోలు తీస్తారు. కానీ ఫ్రీ ఫ్లైట్ టికెట్ అడిగేంత ధైర్యం ఎంతమ ందికి ఉంటుంది?" అని మరో యూజర్ కామెంట్ చేశాడు.

# భవానీ నగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

## - బస్తీ బాట కార్యక్రమంలో పర్యటించిన కాంగ్రెస్ నేత నెమలి అనిల్ కుమార్







**మల్లాపూర్, జనవరి 28, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం భవానీ నగర్ కాలనీలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి విద్యుత్ పోల్స్ సమస్యలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలపై చర్చించడంతో పాటు, నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని నెమలి అనిల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాంద్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సంయుక్త కార్యదర్శి ఉండం శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొయలకొండ రాజేష్, లక్ష్మీపతి, అన్వర్, అశోక్ గౌడ్, విలాయత్ ఖాన్, మహేష్ పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక నాయకులు బాబు భాయ్, వెంకటేష్, రమేష్ నాయక్, ప్రవీణ్, అమ్ము భాయ్, రఘు తదితరులు తమ సమస్యలను వివరించారు.

### యూజీడి, తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

భవానీ నగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని బుధవారం జలమండలి డీజిఎం సతీష్, ఏఈ సిరాజుద్దీన్ లను నెమలి అనిల్ కలసి కోరారు. బస్తీ బాట కార్యక్రమంలో గుర్తించిన డ్రైనేజ్, తాగునీటి సమస్యలపై పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గతంలో సమర్పించిన వినతి పత్రాలకు సంబంధించిన పెండింగ్ పనులపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరితగతిన పరిష్కారం చూపేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు నెమలి అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి వి. శ్రీనివాస్, సీనియర్ నాయకులు కె. రాజేష్, అన్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల రాజ్యమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యం

## - మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ పీ జెండా ఎగరాలి
## - కాంగ్రెస్ తీరుపై ధ్వజం.. కార్పొరేట్ రాజకీయాలను తరిమి కొట్టండి
## - టీఆర్ పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్ శంకర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 28, (తెలంగాణ దిశ):** తెలంగాణలో సామాన్యులకు, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కడమే తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్ పీ) ప్రధాన ఆశయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్ పట్టణం లోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహిం చిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథు లుగా పాల్గొని మాట్లాడారు. ఈ సం దర్భంగా హరిశంకర్ గౌడ్ మాట్లాడు తూ అధికారంలోకి రాకముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ఆ మాట తప్పిందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు లేకుండానే మున్సిపల్ ఎన్నికలకు వెళ్లడం బీసీ సమాజాన్ని వెన్నుపోటు పొడవడమేనని ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసమే తీన్మార్ మల్లన్న ఈ పార్టీని స్థాపించారు. మేడ్చల్ జిల్లాలో కార్పొరేట్ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడాలి. ధనబలంతో రాజకీయాలను శాసించాలని చూస్తున్న నాయకులకు ఈ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవ చేసే గుణం ఉన్న తమ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదిం చాలని కోరారు. జరగబోయే ఎన్నికల్లో జిల్లా పరిధిలోని ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లోనూ టీఆర్‌పీ తరపున కౌన్సిలర్ అభ్యర్థు లను బరిలోకి దింపుతున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరగా, వారికి హరిశంకర్ గౌడ్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు శాలిని, యువజన విభాగం అధ్యక్షులు అరుణ్ పటేల్, కార్మిక విభాగం అధ్యక్షులు సాయికుమార్ పటేల్, వైస్ ప్రెసిడెంట్ విక్రం యాదవ్, ముత్యాల శంకర్ యాదవ్, రాంప్రసాద్, నీరుడు బాబు, శ్రీధర్ యాదవ్, సోషల్ మీడియా ఇంచార్జీలు దుర్గాప్రసాద్, గజం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 28, (తెలంగాణ దిశ)** :మున్సిపల్ సాధారణ ఎన్నికల 2026లో భాగంగా జిల్లాలోని ఆలియాబాదు, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు ఎన్నికల సాధారణ పరిశీలకురాలుగా కొర్ర లక్ష్మి ఐఎఎస్, వ్యయ పరిశీలకులుగా సునయన చౌహాన్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి కొర్ర లక్ష్మి ఆలియాబాదు మున్సిపాలిటిలోని పోలింగ్ బూతులను బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను, రేలింగ్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తొలుత కలెక్టరేట్ కు వచ్చిన కొర్రలక్ష్మికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

# ఓయాసిస్ జనని యాత్ర వరంగల్

వరంగల్: భారతదేశంలో అత్యంత విశ్వసనీయ రీప్రొడక్టివ్ మెడిసిన్ సంస్థల్లో ఒకటైన ఓయాసిస్ ఫెర్టిలిటీ, దేశవ్యాప్తంగా ఫెర్టిలిటీ అవగా హన పెంచే లక్ష్యంతో చేపట్టిన ఓయాసిస్ జనని యాత్ర వరంగల్ చేరింది. టైర్ ఎ, ఈ, ఎఎఎ ప్రాంతాల్లో ఫెర్టిలిటీ అవగాహన, నిపుణుల మార్గదర్శకం, ఫెర్టిలిటీ స్క్రీనింగ్ సేవలను నేరుగా ప్రజలకు అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. జీవనశైలి మార్పులు, ఆలస్య వివాహాలు, శాస్త్రీయ అవగాహన లోపం వంటి కారణాలతో ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతున్న వేళ ఓయాసిస్ జనని యాత్ర బస్సు దంపతులకు ఉ చిత ఫెర్టిలిటీ సలహాలు, ఉచిత ఎ ఎం హెచ్ పరీక్ష, వీర్య పరీక్ష, హీమోగ్లోబిన్ పరీక్షలు వంటి సేవలను అందిస్తోంది. శుభ్రమైన, సురక్షితమైన నమూనా సేకరణ ప్రాంతాలతో ఈ సేవలు మరింత సౌకర్యవంతంగా అందిస్తున్నారు. ఫోర్ట్ వరంగల్ తర్వాత ఈ జనని యాత్ర, తెలంగాణ రాష్ట్రంలో భూపాలపల్లి, జమ్మికుంట, మహబూబాబా ద్ ప్రాంతాలకు వెళ్లి మరింత మంది ప్రజలకు అవగాహన కల్పించనున్నా రు. డా. దుర్గా జి.రావు, మెడికల్ డైరెక్టర్ ఽ కో–ఫౌండర్, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "సైన్స్ ఫెర్టిలిటీ రంగాన్ని మారుస్తున్న ఈ సమయంలో, ఓయాసిస్ జనని యాత్ర ఆధునిక, సాక్ష్యాధారిత ఫెర్టిలిటీ గురించిన సమాచారాన్ని సమాజాల మధ్యకు నేరుగా తీసుకెళ్తోంది. ఫెర్టిలిటీ యాత్రను ప్రారంభిస్తున్న దంపతులకు తొందరగా వైద్య మార్గదర్శకాన్ని అందించడం ద్వారా భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన మార్గం సృష్టిస్తుంది." అని వ్యక్తపరిచారుపుష్కరాజ్ షెనాయ్, సీఈఓ, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "భారతదేశ ఫెర్టిలిటీ రేటు నిరంతరం పడిపోతున్న ఈ సమయంలో, సమయానుకూలమైన, అందుబాటులో ఉన్న ఫెర్టిలిటీ సంరక్షణ మరింత ముఖ్యమైంది. నిపుణుల కన్సల్టేషన్, డయగ్నస్టిక్స్, అవసరమైన మార్గదర్శకంతో 'గుడ్ హ్యాండ్స్ ఆఫ్ సైన్స్'ను గ్రామీణ స్థాయికి విస్తరించుతున్నాం. ప్రతి జంట సరైన నిర్ణయాలు తీసుకునేలా సకాలంలో సహాయం అందించడం మా ధ్యేయం." అని తెలిపారు. కావ్య రావు జలగం, రీజినల్ మెడికల్ హెడ్ ఽ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, "మునుపటి జనని యాత్రకు వచ్చిన అపార స్పందన దంపతులు సరైన మార్గదర్శకాన్ని ఎంత విలువగా తీసుకుంటారో చూపించింది. ఇంకా ఫెర్టిలిటీపై అవగాహన తక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో సరైన సమాచారం, సానుభూతితో కూడిన సహాయాన్ని అందించడం మా ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం." అని అన్నారు. 2009లో స్థాపించిన ఓయాసిస్ ఫెర్టిలిటీ, భారతదేశవ్యాప్తంగా 34 కేంద్రాల తో అగ్రగామి రీప్రొడక్టివ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్.

# సంపాదకీయం

## మాతృశక్తి...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్టును రెండుసార్లు అధిరోహించిన భారత మహిళ సంతోష్ యాదవ్‌ను తమ వ్యవస్థాపక దినోత్సవానికి ఆహ్వానించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఒక కొత్త చర్చకు తెరతీసింది. అసలు మహిళలపై ఆరెస్సెస్ వైఖరి మారుతోందా అనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతోంది. సంఘ్ పరివార్ నిబంధనల ప్రకారం, కేవలం "హిందూ పురుషులు"లు మాత్రమే ఆరెస్సెస్‌లో సభ్యులు కాగలరు. మహిళలకు ఇక్కడ ప్రత్యేక విభాగం ఉంది. దసరా రోజు ప్రసంగానికి ముందుగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ దుర్గాదేవి పూజ చేశారు. ఆరెస్సెస్‌లో ఉదయం నిర్వహించే "శాఖ" మినహా.. మిగతా పనులన్నింటిలోనూ పురుషుల్లానే మహిళలు కూడా పాలుపంచుకుంటారని ఆ ఆరోజు ఆయన చెప్పారు. ఇప్పుడు తాజాగా సంతోష్ యాదవ్‌తో ఆయన వేదిక పంచుకొని మహిళలపై తమ వైఖరి మారుతోందని చెప్పే చర్చను మరో అడుగు ముందుకు తీసుకెళ్లారు. అంతేకాదు.. అంతటా శాంతి, పవిత్రతలు నెలకొనేలా చూడటంలో స్త్రీ శక్తికి ప్రాధాన్యం ఇవ్వడం అనివార్యం"అని కూడా ఆయన అన్నారు. మహిళల గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ "రాష్ట్ర సేవిక సమితి" పేరును ఆరెస్సెస్ ముందుకు తీసుకొస్తుంది. సంఘ్‌లో ఇది మహిళల విభాగం. అయితే, దీని పేరు పెద్దగా వినిపించదు. నిజానికి సేవిక సమితిని కూడా ఆరెస్సెస్ అనే పిలుస్తారు. దీన్ని కూడా ప్రధాన ఆరెస్సెస్‌లానే విజయ దశమి రోజు కేశవ్ బలిరామ్ హేగ్డేవార్ మొదలుపెట్టారు. సంఘ్‌లో పురుషాధిపత్యంపై చాలా చర్చ జరుగుతుంటోంది. ఈ వైఖరిని మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రస్తుతం సంతోష్ యాదవ్‌ను ఆహ్వానించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదివరకు కూడా కాంగ్రెస్ నాయకురాలు రాజ్‌కుమారి అమృత్ కౌర్, మాజీ ఎంపీ అనుసూయ బాయి కాలే ఇలా మరికొంత మంది ప్రముఖులను కూడా ఇదివరకు ఆరెస్సెస్ ఇలా ఆహ్వానించింది. భారత సంప్రదాయంలో స్త్రీ, పురుషులను ఒకరికొకరు తోడు–నీడగా మోహన్ భాగవత్ చెబుతుంటారు. "విదేశీ దండయాత్రల వల్ల ఈ సంప్రదాయం పూర్తిగా దెబ్బతింది. అయితే, పూజించడం లేదంటే రెండో తరగతి పౌరులుగా వంటగదికే పరిమితం చేయడం లాంటివి ఎక్కువయ్యాయి. నేడు మళ్లీ మాతృశక్తికి సాధికారత కల్పించాలి. ఉద్యోగం, కుటుంబం, ప్రజాజీవనం ఇలా అన్నింటిలోనూ వారికి సగ భాగం ఇవ్వాలి"అని ఆయన చెప్పారు. ఇటీవల సమాజంలోని భిన్న వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఆరెస్సెస్ చర్చలు మొదలుపెట్టింది. సామాజిక సమస్యలు, కుల వివక్ష లాంటి అంశాలపై ఇమామ్ షాహిబ్‌తో మాట్లాడేందుకు మోహన్ భాగవత్ ముస్లింల ప్రార్థనా స్థలానికి కూడా వెళ్లారు. దీంతో ఆరెస్సెస్ వైఖరిలో మార్పు వస్తోందనే చర్చ ఎక్కువైంది. సమాజంలో తమపై పడిన ముద్రను చెరిపేసుకోవడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు నేడు సంఘ్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని రాజకీయ విమర్శకులు అంటున్నారు. అయితే, మహిళల విషయంలో గత మూడు దశాబ్దాలుగా ఆరెస్సెస్ వైఖరి మారుతూ వస్తోందని సంఘ్ మద్దతుదారులు అంటున్నారు. మీరు ప్రసంగంలో భాగవత్ వాడిన పదాలను జాగ్రత్తగా గమనించండి. దానిలో పురుషాధిక్య పదజాలం చాలా కనిపిస్తుంది. అసలు సంప్రదాయ కుటుంబ వ్యవస్థకు వెలుపల మహిళలు జీవించలేరనే ధోరణిలో ఆయన మాట్లాడారు. మహిళలకు వారి శరీరాలపై వారికి హక్కులు ఇచ్చేందుకు సంఘ్ సిద్ధంగా లేదు"అని దిల్లీ జవహర్‌లాల్ యూనివర్సిటీలోని సోషియాలజీ ప్రొఫెసర్ హరీశ్ వాంఖడే అన్నారు. మోహన్ భాగవత్ తన ప్రసంగంలో మహిళల గురించి మాట్లాడేటప్పుడు పదేపదే "మాతృ–శక్తి" అనే పదాన్ని ఉపయోగిస్తూ కనిపించారు. ముఖ్యంగా మహిళల జీవితంలో "మాతృత్వం" అనే అంశానికి ఆరెస్సెస్ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తుంటుంది. నాగ్‌పుర్‌కు చెందిన మరాఠీ రచయిత అరుణ సబానే ఈ విషయంపై మాట్లాడుతూ.. "తల్లి అనే పదం వారికి ఒక లక్ష్మణ రేఖ లాంటిది. మహిళలు ఈ గీత దాటి ముందుకు రాకూడదని వారు భావిస్తారు"అని ఆమె అన్నారు. 1987నుంచీ సంఘ్‌లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం క్రమంగా పెరుగుతూ వస్తోందని ఏళ్ల నుంచీ ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న దిలీప్ దేవధర్ అన్నారు. "ఇక్కడ సంఘ్‌లో ఒక కుటుంబ సభ్యుడు చేరితే, ఆ కుటుంబం మొత్తం దానిలో చేరినట్లే. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా సంఘ్‌లో చేరినట్లుగానే భావించాలి"అని ఆయన వివరించారు. అయితే, సంఘ్‌లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందనే విషయాన్ని దిలీప్ అంగీకరించారు. "సమాజంలో మహిళల సంఖ్యతో పోలిస్తే, వారికి సముచిత స్థానం లభించడంలేదు"అని ఆయన అన్నారు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత, నేను మళ్లీ సంఘ్ విజయదశమి కార్యక్రమానికి మళ్లీ హాజరయ్యాను. ఇక్కడ ముఖ్య అతిథుల్లో చాలా మంది కనిపించారు. అయితే, "పార్థ సంచాలన్" సహా కొన్ని కార్యక్రమాల్లో మహిళలు కనిపించలేదు. ఈ విషయంపై అక్కడ వాలంటీర్లతో మాట్లాడినప్పుడు.. "కొన్ని కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనని మాట వాస్తవమే. దీని బట్టి సంఘ్‌లో మహిళలే లేరని అనుకోకూడదు. ఆరెస్సెస్‌లో చాలా మంది మహిళలు సేవలు అందిస్తున్నారు. సంఘ్‌లో వారి పాత్ర క్రమంగా పెరుగుతోంది"అని అక్కడున్న వారు చెప్పారు. మరో వాలంటీర్ మాతో మాట్లాడుతూ.. "సంఘ్‌లో మొత్తంగా 36 సంస్థలు ఉన్నాయి. వీటిలో రాష్ట్ర సేవిక సమితి కూడా ఒకటి. ఇక్కడ అన్ని సంస్థలూ కలిసి పనిచేస్తాయి. అంతేకానీ, మహిళల విషయంలో ఎలాంటి వివక్షా ఉండకూడదు"అని అన్నారు. సేవిక సమితిని ఆరెస్సెస్‌తో సమానమని సంఘ్ పరివార్ చెబుతుంటుంది. దేశ పునర్నిర్మాణంలో సంఘ్‌లోనే ఇది కూడా పనిచేస్తోందని వివరిస్తోంది. ఆరెస్సెస్ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి నిధి త్రిపాఠి కూడా ఈ విషయంపై మాట్లాడారు. "మాతృత్వాన్ని ప్రతికూల కోణంలో ఎప్పుడూ చూడకూడదు. మహిళలకు భిన్న రకాల శక్తి సామర్థ్యాలు ఉంటాయి. లక్ష్మీబాయిని తీసుకోండి. ఆమె రాణి, యోధురాలు, మంచి తల్లి. ఎన్నో బాధ్యతలను ఆమె విజయవంతంగా నిర్వర్తించారు"అని ఆమె అన్నారు. అయితే, మహిళల శక్తి సామర్థ్యాల విషయంలో కుటుంబ బంధాలకు అతీతంగా ఆరెస్సెస్ ఆలోచించాలని హరీశ్ వాంఖడే అన్నారు. అత్యాచారాలు, మతపరమైన పెళ్లిళ్లు లాంటి సంస్థ తమ వైఖరిని కూడా స్పష్టం చేయాల్సి ఉందని ఆయన వివరించారు. "అసలు మహిళలు ఎవరిని పెళ్లి చేసుకోవాలో వారు ఎలా నిర్ణయిస్తారు ఆమె ఏ మతానికి చెందిన వ్యక్తిని ఎంచుకుంటే ఏముంది "అని వాంఖడే అన్నారు. హిందూ యువతులు వేరే మతాలకు చెందిన అబ్బాయిలను పెళ్లి చేసుకోవడంపై బీజేపీ, పార్టీకి చెందిన అగ్రనాయకులు తమ వ్యాఖ్యలతో తరచూ వివాదాలు సృష్టించే సంగతి తెలిసిందే. సంఘ్‌లోకి సంప్రదాయవాదులు, ఆధునిక విధానాలను అనుసరించే వారి మధ్య ఒకరకమైన ఘర్షణ కనిపిస్తోందని సోషియాలజిస్టు బద్రి నారాయణ్ వివరించారు. "ప్రస్తుతం కొన్ని అంశాల్లో మార్పు కనిపిస్తోంది. కానీ, సంస్కరణలు కనిపించేందుకు సమయం పడుతుంది"అని ఆయన అన్నారు. అయితే, ఇది కేవలం బీజేపీకి పరిస్థితిని అనుకూలంగా మార్చడానికి చేసే ప్రయత్నంగానే చూడాలని వాంఖడే అంటున్నారు. కానీ, మహిళలకు సమానత్వం కల్పించే విషయంలో ఆరెస్సెస్ అధిపతి చాలా సీరియస్‌గా ఉన్నారని సంఘ్ వాలంటీర్లు చెబుతున్నారు. దిలీప్ దేవధర్ కూడా మహిళా రిజర్వేషన్లకు సంఘ్ కట్టుబడి ఉందని అన్నారు.

# కమలంలో లీకు వీరులు ఎవరు..?




హైదరాబాద్,తెలంగాణ దిశ : "మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దనిచెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం"..అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఎం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యా యని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే. ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది. బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్‌ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతోకాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ..: మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. భేటీ వివరాలను లీకు చేసినోళ్లు మెంటల్‌గాళ్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ వివరాలను బయటకు చెప్పొద్దని స్వయంగా మోదీ ఆదేశించినా పట్టించుకోకపోవడం విచారకరం అంటూ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. లీకులు ఇచ్చిన ఎంపీలెవరో మీడియా ప్రతినిధులు చెప్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

# ఏపీ సమస్యలపై తెలంగాణలో ఆందోళన...

హైదరాబాద్,తెలంగాణ దిశ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొందరు చేస్తున్న పనులు పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నాయి. చాలామంది నేతలు ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ మాత్రం పక్క రాష్ట్రాల్లో చేస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి వారంలో మూడు రోజులు పాటు తాడేపల్లి కి వచ్చి పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. మిగతా నాలుగు రోజులు బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అయితే ఆయనను చూసి ఇప్పుడు కొత్తగా యాంకర్ శ్యామల లాంటి వారు సైతం ఏపీని తొంగి చూడడం లేదు. హైదరాబాదులో ఉంటూ ప్రత్యేక వీడియోలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై అధికార ప్రతినిధి హోదాలో ఇలా వీడియోలు తీసి మీడియాకు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అంతవరకు ఓకే కానీ.. ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సైతం హైదరాబాదులోనే.. అది కూడా తాను నివాసం ఉంటున్న కూకట్పల్లి ప్రాంతంలోనే నిర్వహిస్తుండడం మాత్రం కాస్త అతిగా మారుతుంది. సోషల్ మీడియావచ్చాక రాజకీయ పార్టీల తీరు మారింది. ఆ పార్టీ కార్యక్రమాల తీరు కూడా మార్చేశారు. ఎక్కడో విదేశాల్లో ఉంటే సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాకు జత చేస్తున్నారు. మెయిన్ మీడియా కూడా అదే వీడియోను ప్రసారం చేసి వారికి ఎనలేని ప్రచారం కల్పిస్తోంది. అయితే పెద్ద నేతలు వరకు ఓకే కానీ అధికార ప్రతినిధి హోదాలో.. పనిచేస్తున్న యాంకర్ శ్యామల లాంటి వారు కూడా ఇలా చేయడం ఏంటి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రశ్న వినిపిస్తోంది. పైగా ఆమెకు ఆర్థిక ప్రయోజనం ఉందన్న టాక్ ఉంది. జీతాల రూపంలో సేవలు అందిస్తున్నారు అన్న మాట వినిపిస్తోంది. ఇటీవల పిన్నెల్లి బ్రదర్స్ అరెస్టయ్యారు. అయితే ఆమెకు ఆ విషయం తెలియదు అన్నట్టు ఉంది. వారు రెండు రోజుల క్రితం అరెస్టు అయితే.. ఆమె నిన్ననే కారుమూరి వెంకటరెడ్డి అనే నేత కలిసి కూకట్పల్లిలో ఆందోళన చేశారు. అంతకు ముందు కూడా ఆమె ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు హైదరాబాదులో. అక్కడే సంతకాల సేకరణ చేపట్టారు. అయితే ఆమె ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ హైదరాబాదులో ఉంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం తన బుల్లితెర కెరీర్ ను వదులుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి కొంత మొత్తం జీతం అందుకుంటున్నారన్న టాక్ ఉంది. అందుకే కాబోలు హైదరాబాదు నుంచి తన రాజకీయాలను సాగిస్తున్నారు. అయితే తమకు అలాంటి అవకాశం కల్పించాలని ఇప్పుడు వైసీపీ నేతలు పార్టీ హై కమాండ్ ను కోరుతున్నారు. ఎక్కడో వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయం చేస్తాము అంటూ సెటైర్లు వేస్తున్న వారు ఉన్నారు.

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి..!




హైదరాబాద్,తెలంగాణ దిశ :ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒక మాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకుపోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడదూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది.

# ఎగిరే కారు వచ్చేస్తోంది!

## దీని ధర రూ.2.83 కోట్లు..!



వాషింగ్టన్: ప్రపంచపు తొలి ఎగిరే కారు త్వరలో అందుబాటులోకి రాబోతున్నది. అలెఫ్ మోడల్ ఏ అల్ట్రాలైట్ కారు ఎనిమిది ప్రొపెల్లర్స్‌ను ఉపయోగించి, గాలిలో ఎగురుతుంది. ఇవి బూట్, బానెట్‌లో ఉంటాయి. ఎగరవలసిన అవసరం లేనపుడు ఈ కారు సాధారణంగానే రోడ్డు మీద ప్రయాణిస్తుంది. దీని ధర సుమారు రూ. 2.83 కోట్లు ఉండవచ్చు. అమెరికాలోని అలెఫ్ ఏరోనాటిక్స్ ఈ కారును అభివృద్ధి చేయడానికి ఓ దశాబ్దానికిపైగా పట్టింది. త్వరలోనే తొలి కస్టమర్లకు ఈ కార్లను అందజేస్తామని ప్రకటించింది. కాలిఫోర్నియాలోని సిలికాన్ వ్యాలీలో ఉన్న ఈ కంపెనీ ప్లాంట్‌లో ఈ కార్లను హ్యాండ్ అసెంబుల్ చేస్తున్నారు. వాస్తవ పరిస్థితుల్లో ఈ కార్లను పరీక్షించడం కోసం ముందు కొందరికి మాత్రమే వీటిని అందజేస్తామని ఈ కంపెనీ తెలిపింది. కస్టమర్లకు అందజేయడానికి ముందు కొన్ని నెలలపాటు వీటిని క్షుణ?ంగా పరిశీలించవలసి ఉంటుందని చెప్పింది. ఇవి సాధారణ రోడ్లపై ప్రయాణించేటపుడు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించిన తర్వాత వీటిని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయవచ్చునని పేర్కొంది. ఫ్లయింగ్ ట్యాక్సీలకు విమానాశ్రయాలు లేదా వెర్టిపోర్ట్స్ అవసరం. ఫ్లయింగ్ కార్స్‌కు మాత్రం వాటి అవసరం ఉండదు. ఇవి రోడ్డుపైన, గాలిలో ప్రయాణించగలవు. రెక్కలు లేకుండానే ఎగరగలదు. కంపెనీ సీఈవో జిమ్ దుఖోవ్నీ మాట్లాడుతూ, ఈ కారును నడిపే విధానాన్ని కేవలం 15 నిమిషాల్లో నేర్చుకోవచ్చునని చెప్పారు.

# క్యాన్సర్ తీవ్రతను ఇట్టే చెప్పేసే రక్త పరీక్ష



హైదరాబాద్,తెలంగాణ దిశ : క్యాన్సర్ కారణంగా ఏటాకోటి మంది మృత్యువాత పడుతున్నారు. వ్యాధిని నిర్ధారించడంలో జరిగే ఆలస్యం కారణం గానే బాధితుల సంఖ్య పెరుగుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. దీనికి చెక్ పెడుతూ క్యాన్సర్ మహమ్మారిని రియల్‌టైమ్‌లో సత్వరమే గుర్తించడమే కాకుండా దాని తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేసే సరికొత్త రక్త పరీక్షను ఇంగ్లండ్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. అడ్వాన్స్‌డ్ ఇన్‌ఫ్రారెడ్ స్కానింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఎనాలిసిస్‌తో పనిచేసే ఈ సాంకేతికత సాయంతో క్యాన్సర్ కణాల పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ చికిత్సను అందించవచ్చని నిపుణులు తెలిపారు.

# ఇక రయ్ రయ్..

## టోల్‌గేట్లు ఉండవ్..



ముంబై: వాహనదారులకు ఇది గుడ్ న్యూస్. ఇక మీరు వాహనంపై వెళ్లేటప్పుడు టోల్ గేట్ల దగ్గర ఆగాల్సిన అవసరం లేదు. ఇక రయ్ రయ్ అంటూ నాన్ స్టాఫ్‌గా దూసుకెళ్లిపోవచ్చు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ సిస్టమ్ ద్వారా కూడా నగదు అవసరం లేకుండా డైరెక్ట్‌గా టోల్ ఫీజు చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

దీని వల్ల టోల్ గేట్ వద్ద వేచిచూసే సమయం భారీగా తగ్గింది. అయినాపండుగల రద్దీ సమయంలో వాహనదారులు ఎక్కువగా ఉంటారు. ఇలాంటి సమయం లో ఫాస్టాగ్ స్కానర్ ద్వారా పేమెంట్ ప్రక్రియ పూర్తి చేసుకుని వెళ్లాలంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పుడు దీనికి కూడా చెక్ పడింది. ఇక మీరు టోల్ గేట్ల దగ్గర ఒక్క నిమిషం కూడా ఆగాల్సిన అవసరం ఉండదు. ఫాస్టాగ్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ ఆధారిత మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ కలెక్షన్ సిస్టమ్‌త్వరలో రాబోతుంది. ఈ సిస్టమ్ ద్వారా టోల్ గేట్ దగ్గర ఆగాల్సిన అవసరం ఉండదు. రోడ్లపై కొన్ని చోట్ల కెమెరాల తో కూడిన ప్రత్యేక స్ట్రక్చర్లు ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు నెంబర్ ప్లేట్లను స్కాన్ చేసి ఆటోమేటిక్‌గా టోల్ కట్ అయ్యేలా చేస్తాయి.

దీనివల్ల మీరుఒక్క నిమిషం కూడాఎక్కడా ఆగేపని ఉండదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 11టోల్ ప్లాజాల్లో ఈ తరహాలో పేమెంట్స్‌ను స్వీకరిస్తున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చే అవకాశముంది. ఆటోమేటిక్ పేమెంట్స్ స్వీకరించే కాంట్రాక్ట్‌ను పలు టోల్ ప్లాజాల వద్ద జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ మేరకు ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. డెడికేటెడ్ షార్ట్–రేంజ్ కమ్యూనికేషన్‌తో పాటు డియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ టెక్నాలజీలతో కలిసి ఈ కొత్త టోల్ వ్యవస్థ పనిచేస్తుంది. రానున్న రోజుల్లో ఈ కొత్త టోల్ వ్యవస్థ దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని తెలుస్తోంది. దీని వల్ల వాహనదారులకు సమయం ఆదా కానుంది.

# ఆదివాసీ హక్కుల రక్షణ, భాగస్వామ్యంతోనే



భారత రాజ్యాంగంలో ఆదివాసీ ప్రాంత పాలనకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమానత్వాన్ని న్యాయంగా అమలు చేయాలనే సంకల్పంతో ప్రజాస్వామ్యంలో చేసిన అత్యంత సున్నితమైన ప్రయోగాలలో రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ఒకటి. ఆదివాసీ సమాజాల ప్రత్యేక సామాజిక-సాంస్కృతిక స్వరూపాన్ని గుర్తించిన రాజ్యాంగం, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక నియమాలను రూపొందించింది. ఆర్టికల్ 244(1) మరియు ఐదో షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటయింది. సమానత్వం అంటే అందరికీ ఒకే విధమైన చట్టాలు వర్తింపజేయడం కాదని, న్యాయం సాధించాలంటే భిన్నమైన పరిస్థితులకు భిన్నమైన రక్షణ అవసరమని రాజ్యాంగం గుర్తిస్తుంది. అయితే రాజ్యాంగ పరిరక్షణ నియమాల లక్ష్యం నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న లేవనెత్తుతోంది. ఆదివాసీల హక్కులను కాపాడేందుకు రూపొందించిన ఐదో షెడ్యూల్ తన లక్ష్యాన్ని నిజంగా సాధిస్తున్నదా?

2011 జనగణన ప్రకారం భారతదేశంలో షెడ్యూల్డ్ తెగల జనాభా సుమారు 10.4 కోట్లుగా ఉంది. ఇది దేశ జనాభాలో 8.6 శాతం. ఐదో షెడ్యూల్ కింద ప్రకటించిన షెడ్యూల్డ్ ఏరియాలు దేశ భూభాగంలో సుమారు 11.3 శాతం విస్తీర?ంలో ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. అయితే మొత్తం ఆదివాసీ జనాభాలో కేవలం 41 శాతం మాత్రమే ఈ షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసిస్తుండగా, మిగిలిన 59 శాతం ఐదో షెడ్యూల్ రక్షణ పరిధికి బయట ఉన్నారు.

నెహ్రూ పంచశీల సూత్రం: 1958లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన 'ఆదివాసీ పంచశీల సూత్రం' అభివృద్ధి పేరుతో ఆదివాసీలను ప్రధాన స్రవంతిలో బలవంతంగా కలిపివేయాలనే విలీన భావనను ఆయన తిరస్కరించారు. ఆదివాసీల సంస్కృతి, జీవన విధానం, స్వయంపాలనను గౌరవిస్తూ అభివృద్ధి జరగాలని నెహ్రూ స్పష్టం చేశారు. బయటి వారి జోక్యం తగ్గించి, అవసరమైన చోట సాంకేతిక సహాయం మాత్రమే అందించాలన్నది ఆయన దృష్టి కోణం. అంటే ఆదివాసీలే తమ ప్రాంత పాలనలో ప్రధాన పాత్ర పోషించాలి. వారి అభివృద్ధిని వారే నిర్దేశించుకోవాలి.

గవర్నర్ అధికారాలు-రాజ్యాంగ ఉద్దేశం: అవసరమనుకుంటే ఆదివాసీల హక్కుల రక్షణకు గవర్నర్ ఒక నోటిఫికేషన్ ద్వారా ఐదో షెడ్యూల్ పేరా 5(1) ప్రకారం, కేంద్ర లేదా రాష్ట్ర చట్టాలు షెడ్యూల్డ్ ఏరియాలకు వర్తించకూడదని లేదా మార్పులతో వర్తించాలని నిర?యించవచ్చు. అవసరమైతే అ మార్పులను చట్టాల అమలులోకి రాక మునుపు కాలానికి కూడా వర్తింపజేయవచ్చు. ఆ అధికారం ఆదివాసీ ప్రయోజనాలకు హానికరమైన చట్టాల నుంచి రక్షణ కల్పించే శక్తివంతమైన సాధనం. అలాగే పేరా 5(2) కింద 'శాంతి, మంచి ప్రభుత్వ పాలన' కోసం షెడ్యూల్డ్ ఆదివాసీ భూమి బదలాయింపులు, వడ్డీ వ్యాపారం, సామాజిక నియంత్రణ వంటి అంశాలపై గవర్నర్ నిబంధనలు రూపొందించవచ్చు. గిరిజన సలహా మండలి సిఫార్సులు, రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఇవి చట్టబద్ధత సంతరించు కుంటాయి.

న్యాయవ్యవస్థ పాత్ర: గత కొన్ని దశాబ్దాలుగా భారత దేశ న్యాయస్థానాలు ఐదో షెడ్యూల్‌ను విశ్లేషిస్తూ, దాని రక్షణాత్మక ఆత్మను, రాజ్యాంగ పరిమితులను స్పష్టత చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో (1997) షెడ్యూల్డ్ ప్రాంతాలలో గవర్నర్‌కు అసాధారణమైన రాజ్యాంగ పాత్ర ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 154, 163 కింద మంత్రివర్గ సలహాకు లోబడి కాకుండా, స్వతంత్రంగా వ్యవహరించి ఆదివాసీ హక్కులను రక్షించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తీర్పు చెప్పింది. గవర్నర్ కేవలం సంతకం చేసే అధికారి కాదని, ఆదివాసీ హక్కుల రక్షకుడని పేర్కొంది. అలాగే పి.రామిరెడ్డి కేసు (1988)లో ఆదివాసీ భూ పరాయీకరణ నిరోధించడానికి 1/70 రెగ్యులేషన్ వంటి కఠిన ఆంక్షలు రాజ్యాంగబద్ధమేనని ధృవీకరించింది. ఇది పేరా 5(2) కింద గవర్నర్ శాసనాధికారాన్ని ధృవీకరించింది. రాష్ట్ర షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరుల పేర భూ బదలాయింపులు 1/70 రెగ్యులేషన్ నిషేధిస్తుంది. అంటే ఆదివాసీలు, గిరిజనేతరుల మధ్య అలాగే గిరిజనేతరుల మధ్య భూ బదలాయింపులు కూడా చెల్లవు. 1/70 రెగ్యులేషన్ అమలు విషయంలో ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరులుగానే భావించాలని సుప్రీంకోర్టు సమత కేసులో పేర్కొంది.

అదే విధంగా, అమరేంద్ర ప్రతాప్ సింగ్ వర్సెస్ తేజ్ బహదూర్ ప్రజాపతి (2003) కేసులో, ఆదివాసీ భూములపై అనాదరణ స్వాధీనం ద్వారా గిరిజనేతరులు హక్కు సంపాదించలేరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సాధారణ చట్ట సూత్రాలు రాజ్యాంగ రక్షణలను అధిగమించలేవని స్పష్టం చేసింది. బాల్కో ఉద్యోగుల సంఘం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002) కేసులో కూడా, ఆదివాసీలకు అనుకూలమైన రిజర్వేషన్లు వంటి రక్షణాత్మక చర్యలు సమానత్వ సూత్రానికి విరుద్ధం కాదని, ఆర్టికల్ 15(4), 46 కింద అవి సమర్థనీయమని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ ప్రయోజనాలకు రాష్ట్ర, కేంద్ర చట్టాలు అనుకూలంగా లేదా భిన్నంగా ఉన్నాయా అనేది ముందుగా పరిశీలించే సమర్థవంత మైన వ్యవస్థ చాలా రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాల్లో లేదు. ఫలితంగా సాధారణ చట్టాలు యథేఛగా ఈ ప్రాంతాలకు వర్తించి ఆదివాసీ రక్షణ కోసం ఉద్దేశించిన రాజ్యాంగ ప్రత్యేక రక్షణలు క్రమంగా బలహీ నపడుతున్నాయి.

గత న్యాయ స్థానాల భావజాలం, ఆదివాసీ హక్కుల రక్షణ విషయంలో చూసే కోణంతో పోలిస్తే ప్రస్తుత న్యాయస్థానాల ఆలోచన, తీర్పుల స్వభావంలో చాలా మార్పు కనిపిస్తున్నది. దానివల్ల ఆదివాసీ హక్కుల పరిరక్షణ మరింత జటిలమవుతున్నది.

తాజా న్యాయ ధోరణులు-కొత్త సవాళ్లు: చేబ్రోలు లీలా ప్రసాద్‌రావు వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (2020) కేసులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలకు 100 శాతం ఉపాధ్యాయ పోస్టుల రిజర్వేషన్‌ను రద్దు చేసింది. గవర్నర్ అధికారాలు ప్రత్యేకమైనవే అయినప్పటికీ అవి రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలు,

రిజర్వేషన్ పరిమితులకు లోబడి ఉండాలన్నది కోర్టు అభిప్రాయం. ఈ తీర్పు ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను సూచించినప్పటికీ, అనుకోని ప్రతికూల తీవ్ర ప్రభావాలను ఆదివాసీ జీవనం, ఉనికిపై కలిగించింది. దానివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ ఏరియాల్లో వేలాది స్థానిక ఆదివాసీ ఉపాధ్యాయ, ఇతర ప్రభుత్వ నియామకాలకు ఆటంకం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లోనే ఐదో షెడ్యూల్ పేరా 5(1) కింద గవర్నర్ జారీ చేసిన సుమారు 23 నోటిఫికేషన్ల ద్వారా 4,626 ఉపాధ్యాయ పోస్టులు స్థానిక ఆదివాసీలతో గతంలో భర్తీ అయ్యాయి. ఇక పేరా 5(1) కింద గవర్నర్ ఆదివాసీల ఉద్యోగ నియామక విషయంలో నోటిఫికేషన్ ఇవ్వలేరు..!



## ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్..!

హైదరాబాద్, : ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానాన్ని అమలుచేయాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఫిబ్రవరి 2 నుంచి జరుగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్‌ను అమలుచేయాలని నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతానికి ప్రభుత్వ కాలేజీల్లో జంబ్లింగ్ విధానాన్ని అమలుచేస్తారు. ఆ తరువాత ప్రైవేట్ కాలేజీలకు కూడా విస్తరిస్తారు. ఈ విధానంలో ఒక కాలేజీలో చదివే విద్యార్థులకు సొంత కాలేజీలో కాకుండా, మరో కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షకేంద్రాన్ని కేటాయిస్తారు. ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆదివారాలు సైతం పరీక్షలు జరుగుతాయి.

**ఇంటర్ పరీక్షల షెడ్యూల్లో స్వల్పమార్పు:**

ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్లో స్వల్పమార్పు చోటుచేసుకున్నది. మార్చి 3న హోలీ పండుగ ఉండగా, అదేరోజు సెకండియర్ విద్యార్థులకు గణితం పేపర్-2ఏ, వృక్షశాస్త్రం పేపర్-2, రాజనీతిశాస్త్రం పేపర్-2 పరీక్షలు ఉన్నాయి. హోలీ పండుగ నేపథ్యంలో మూడో తేదీన జరగాల్సిన పరీక్షలను మార్చి 4న నిర్వహించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. సవరించిన షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు సెక్రటరీ కృష్ణఆదిత్య విడుదల చేశారు. మిగతా పరీక్షల షెడ్యూల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టంచేశారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.2 కోట్ల లూటీ

బెంగళూరు: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని బెంగళూరుకు చెందిన ఒక మహిళా లెక్చరర్ రూ.2 కోట్లను పోగొట్టుకున్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెను డిజిటల్ అరెస్ట్ చేయడంతో ఆమె ఫ్లాట్, మరో రెండు నివాస ఫ్లాట్లను అమ్మి వారికి సొమ్ములు చెల్లించింది. విజ్ఞాన్ నగర్‌లో బబితా దాస్ 10 ఏండ్ల కొడుకుతో నివసిస్తోంది. జూన్‌లో ఆమెకు ఒక కొరియర్ కార్యాలయం పేరిట ఒక కాల్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డుకు లింకై ఉన్న ఒక బ్యాగేజ్‌లో అనుమానాస్పద పార్సిల్ ఉందని ఆ వ్యక్తి తెలిపాడు. తర్వాత పోలీసుల పేరుతో బెదిరించి తమ మాట వినకపోతే వారి కుమారుడు చిక్కుల్లో పడతాడని బెదిరించాడు.



# ఆ మూడు జిల్లాలపైనే ఆశలు




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** వైఎస్ జగన్ ఆశలు 2029 ఎన్నికల్లో కూడా నెరవేరేటట్లు కనిపించేటట్లు లేదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. కూటమి ప్రభుత్వం అనేక తప్పిదాలు చేసినప్పటికీ వారు జనంలో ఉంటున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవు తుందని చెబుతున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదం ప్రజల్లోకి బాగా వెళ్లినట్లు కనిపిస్తుంది. కూటమి కలిసి ఉన్నంత కాలం జగన్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉండకపోవచ్చని ఉండవల్లి అరుణ్ కుమార్ వంటి వారు కూడా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుల రాజకీయాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. అదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను విస్మరించడం లేదు.వైసీపీకి ప్రస్తుతం రాయలసీమలోని మూడు జిల్లాల్లో తప్పించి ఎక్కడా బలం పుంజుకోలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రాయలసీమలోనూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో మాత్రమే వైసీపీ ఈ రెండేళ్లలో కాస్త పుంజుకుందని, కానీ కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నది విశ్లేషకుల అంచనా. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొన్ని ప్రజల్లో అసంతృప్తికి గురి చేసినప్పటికీ అది వైసీపీకి ప్లస్ అయ్యేంతగా లేవన్నది వాస్తవం. ఎందుకంటే కొద్దో గొప్పో.. బతిమాలి కేంద్రం నుంచి నిధులను తీసుకు రావడంలో చంద్రబాబు ఒకింత సక్సెస్ అవుతుండటంతో వైసీపీ వైపు చూసే అవకాశం లేదంటున్నారు.ముఖ్యంగా పవన్ కల్యాణ్ వంటి వారు కూటమిలో మిత్రులుగా ఉండటం కూడా కలిసి వచ్చే అంశమే. జనసేనకు ఓటింగ్ లేకపోయినాసామాజికవర్గం, ఫ్యాన్స్ బలం పోలింగ్ కేంద్రాల వద్ద కూటమికి అండగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతు ంది. పవన్ కల్యాణ్, చంద్రబాబు, లోకేశ్ లు నిత్యం జనంలో ఉండటంతోపాటు సమస్యల పరిష్కారానికి కొద్దో గొప్పో కృషి చేయడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. కూటమికి, జగన్ ప్రభుత్వానికి మధ్య పోలిక పెట్టి చూస్తే పెద్దగా తేడా లేకపోవడం కూడా ఎన్డీఏ విజయానికి దోహదపడతాయం టున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో లెక్కలు మారే అవకాశాలు కూడా లేకపోలేదు. ఇప్పటి వరకూ అయితే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ ఛాన్స్ లేనట్లేనని అంటున్నారు.

# మార్కెట్‌లోకి పొరుగు రాష్ట్రాల కూరగాయలు..

### పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికభారం

### రవాణా వ్యయంతో అధికంగా పెరిగిన కూరగాయల ధరలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాష్ట్రంలో కూరగాయల పంటల దిగుబడులు తగ్గడంతో ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్‌లోకి పెద్దఎత్తున దిగుమతి అవుతున్నా యి. ఈ క్రమంలో దాదాపు 68% కూరగాయలు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఏపీ నుంచి వస్తున్నట్టు మార్కెటింగ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి కావడంతో రవాణా చార్జీలు కలుపుకుని ధరలు అధికంగా ఉంటున్నాయని వెల్లడిస్తున్నారు. కర్ణాటక నుంచి టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు, కాలిఫ్లవర్, మహారాష్ట్ర నుంచి క్యారట్, ఉల్లిగడ్డ, గుజరాత్ నుంచి ఆలుగడ్డ,

ఏపీ నుంచి అరటి, ముల్లంగి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ వంటి కూరగాయలు దిగుమతి అవుతున్నట్టు వ్యాపారులు తెలుపుతున్నారు.

రాష్ట్రంలో సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో సాగుచేసిన కూరగాయ తోటల నుంచి నవంబర్ నాటికి పెద్దఎత్తున దిగుబడి రావాలి. కానీ జూలైలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ఆగస్టులో పూర్తిస్థాయిలో పంటలు వేయలేకపోయారు. సెప్టెంబర్ నుంచి సాగుచేసిన కూరగాయ తోటలు అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. టమాటా చెట్లకు వచ్చిన పూత, కాత చాలా వరకూ నెలరాలిపోయింది. దీంతో రాష్ట్రంలో టమాటా కొరత ఏర్పడి.. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడంతో మార్కెట్లలో సుమారు రూ. 60 వరకు ధర పలుకుతున్నది. కాగా, పెరిగిన కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్లలో ఏ కూరగాయల ధర చూసినా కిలోకు సుమారు రూ. 60పైమాటే ఉండటంతో ఆందోళ:న వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కాలంవెళ్లదీసే తమకు ఇప్పుడు పెరిగిన కూరగాయల ధరలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెండు నెలల్లో మార్కెట్‌లోకి కొత్త పంటలు: సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలో కూరగాయల తోటలు దెబ్బతిన్నందున ప్రస్తుతం కొరత ఏర్పడిందని ఉద్యానశాఖ అధికారులు వెల్లడించారు. అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులు తిరిగి ఇప్పుడు మళ్లీ పంటలు వేస్తున్నారని తెలిపారు.


# పునర్విభజన రచ్చ...

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజనపై అనేక అభ్యంత రాలు వస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి కార్పొరేటర్లు మేయర్‌ను కలిశారు. డివిజన్ల పునర్విభజనపై చర్చించారుజీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్.. కార్పొరేటర్లు అభిప్రాయాన్ని తీసుకోనున్నారు. ఇప్పటిదాకా 13 వందలకుపైగా అభ్యంతరాలు వచ్చాయి. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. వ తేదీన డివిజన్ల పునర్విభజనకు తుది ఆమోదం తెలపాలని జీహెచ్‌ఎంసీ అనుకుంటోంది.జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశమయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలని మేయర్‌కు వినతిపత్రం అందించారు. డివిజన్ల పునర్విభజన సరిగా లేదని చాలా మంది విమర్శలు చేస్తున్నారు. ఏ ప్రాంతం డివిజన్‌లో కలుస్తుందనే విషయంపై గందరగోళం నెలకొన్నది. కొత్తగా డివిజన్ల హద్దులు, పేర్లు మార్చడంపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు జీహెచ్‌ఎంసీలోని డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ.. వినయ్ కుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారణ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. డివిజన్ల పునర్విభజనలో తన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

డీ లిమిటేషన్ మీద అభ్యంతరం తెలిపేందుకు కమిషనర్‌ను కలిశామన్నారు. కనీసం తమకు సమాచారం లేకుండానే.., ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండానే.. డివిజన్ల పునర్విభజన చేశారని పేర్కొన్నారు. తమ అభ్యంతరాలను మేయర్, కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఇచ్చామన్నారు.డివిజన్ల విభజనపై ఎటువంటి సమస్యలు ఉన్నాయనే అంశాలను గుర్తించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెప్పారు. కొన్ని డివిజన్లలో ఎక్కువ ఓట్లు మరికొన్ని డివిజన్లలో తక్కువ ఓట్లు గుర్తించామని వెల్లడించారు. అన్ని విషయాలను మేయర్, కమిషనర్లకు వివరించామన్నారు. హద్దులు తెలియకుండా అధికారులు వాటిని ఖరారు చేశారని చెప్పారు.

# 2036 నాటికి పిల్లలు, వృద్ధులు సమానం!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ జనాభా కమిషన్ 'జనాభా అంచనా నివేదిక 2011-2036'లో నమోదు చేసినన ఆయుర్దాయం పెరుగుదల గురించి ఆసక్తిక విషయాలు వెల్లడయ్యాయి. ఆడవారి కంటే మగవాళ్లు తక్కువగా జీవిస్తున్నారు. పురుషుల సగటు ఆయుర్దాయం 2011-2015 కాలంలో సుమారు 67.10 సంవత్సరాలు ఉండగా, 2031-2035 నాటికి 71.40 సంవత్సరాలకు పెరుగుతుందని అంచనా. అదే కాలంలో స్త్రీల ఆయుర్దాయం దాదాపు 71.10 సంవత్సరాల నుండి 75.60 సంవత్సరాలకు పెరగడంతో వారు మరింత మెరుగ్గా బతుకుతారని భావిస్తున్నారు. అంటే ఇప్పటిదాకా మగాళ్ల కంటే మహిళలే ఎక్కువగా జీవిస్తున్నారు. భవిష్యత్తులు కూడా ఇది ఇలాగే కొనసాగనుంది.శిశు మరణాల రేటు తగ్గుదలతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సంతానోత్పత్తి రేటు కూడా గణనీయంగా తగ్గుతోంది. 2013-2035 మధ్య తెలంగాణ సంతానోత్పత్తి రేటు 1.5కి తగ్గుతుంది. పుట్టే పిల్లల సంఖ్య తగ్గడం, ఎక్కువ కాలం జీవించే వ్యక్తులతో జనాభాలో అధిక వయస్సు వర్గాలవారు ఉంటారని వైద్యులు అభిప్రాయపడు తున్నారు.తెలంగాణతో సహా భారత రాష్ట్రాల జనాభా పరిస్థితి మారుతోందని,



ప్రజలు ఎక్కువ కాలం జీవించడమే కాకుండా జనాభాలో వృద్ధాప్యం కూడా పెరుగుతోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ప్రజారోగ్యవిధాన నిపుణులు ఈ నివేదికలోని అంశాల గురించి ప్రస్తావిస్తున్నారు.60 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న జనాభా నిష్పత్తి గణనీయంగా పెరుగుతుందని అంచనా. 2036 నాటికి రాష్ట్రంలో పిల్లలు ఉన్నంత మంది వృద్ధులు ఉంటారు.



# ఆమె వైద్యానికి షష్టిపూర్తి

సమయం.. ఉదయం ఎనిమిది గంటలు. ఆపరేషన్ గది బయట లైటు వెలిగింది. హార్ట్ మానిటర్ చప్పుడు స్పష్టంగా సెకండ్లను లెక్కపెడుతున్నట్టు వినిపిస్తున్నది. ఎమర్జెన్సీ సర్జరీకి సరంజామా సిద్ధమైంది. వీటన్నిటితో పోటీ పడుతూ చకచకా చేతులు కదుపుతున్నదో వైద్యురాలు. అన్నిటికన్నా అక్కడ ఆమే ప్రత్యేకం. ఎందుకంటే ఆమె వైద్యానికి షష్టి పూర్తి నిండింది. ఆమె వయసు 92 దాటింది. మూడు తరాలకు పురుడు పోసి పుణ్యం కట్టుకున్న ఆమే పేదల వైద్యురాలిగా పేరున్న హైదరాబాద్‌కి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ సూరి శ్రీమతి! తన సుదీర్ఘ జీవన ప్రయాణాన్ని, దాన్ని సాధించే రహస్యాల్ని అందరికోసం జిందగీతో పంచుకున్నారు. ఇన్ని సంవత్సరాలుగా వైద్యం ఎలా చేస్తున్నారు అని అడుగుతుంటారు చాలామంది. వయసైపోయింది అని తినడం మానేయలేదే. మరి మనకొచ్చిన పని మాత్రం ఎందుకు మానేయాలి? చక్కగా మూడు పూటలా తింటున్నది అరుగుతున్నప్పుడు ఊరికే కూర్చొని ఉండాలని ఎందుకు కోరుకోవాలి? నేను భగవంతుణ్ని, ముఖ్యంగా సత్యసాయిబాబాను చాలా నమ్ముతాను. వైద్యం దేవుడు చేస్తాడు. క్రెడిట్ డాక్టర్ తీసుకుంటారు అని అనుకుంటాను. కాబట్టి చేస్తున్నది నేను కానప్పుడు ఆపే హక్కు కూడా నాకెక్కడిది. ఉద్యోగం చేసినప్పటి సంగతి వేరు. ఉస్మానియా, నీలోఫర్, గాంధీ ఆసుపత్రులతో పాటు నిజామాబాద్, కర్నూలు, గోదావరి జిల్లాలూ ఇలా చాలా చోట్ల పనిచేశా. దవాఖానాలో కంటిన్యూగా 32 గంటలపాటు డ్యూటీ చేసేదాన్ని. ఇప్పుడు ఇంట్లోనే ఆసుపత్రి కాబట్టి కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశమూ ఉంటుందిగా. మరో విషయం నేను వైద్యవృత్తిలో చేరేటప్పుడు నా దగ్గరికి వైద్యం కోరి వచ్చిన ఏ వ్యక్తికైనా నా శక్తిమేరకు తప్పకుండా చికిత్స చేస్తానని ప్రమాణం చేశాను. అలాంటప్పుడు దాన్ని నేను పాటించాల్సిందేగా!

యోగా జీవనం: జనంలో యోగా మీద ధ్యాస మా చిన్నప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా పెరిగింది. ఇది ప్రతి మనిషీ చెయ్యాల్సిన ప్రధానమైన క్రియ అని చెబుతాన్నేను. మా నాన్నగారు సూరి రాఘవ దీక్షితులు హైదరాబాద్‌కి యోగాను పరిచయం చేశారు. ఆయన మన దేశంలోని ప్రముఖ యోగా గురు ధీరేంద్ర బ్రహ్మచారి దగ్గర యోగా నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని కోఠిలోని గాంధీ జ్ఞానమందిర్‌లో ఒక యోగా కేంద్రాన్నీ, సికింద్రాబాద్‌లోని గీతాభవన్‌లో మరో కేంద్రాన్నీ ప్రారంభించారు. నేటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. అంతేకాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పలుచోట్ల ఆయన స్థాపించిన వివిధ యోగా సెంటర్‌లు ఇప్పటికీ జనానికి ఆరోగ్య ప్రసాదాన్ని పంచుతూనే ఉన్నాయి. నాన్న రైల్వేలో పనిచేసేవారు. ఆ ట్రాన్స్‌ఫర్లు ఆయనకు రకరకాల చోట్ల కేంద్రాలు స్థాపించేందుకు అవకాశాన్నిచ్చాయి. ఉద్యోగం చేసేవారు కూడా సమయం లేదనకుండా చక్కగా యోగా చేసుకోవచ్చు అనడానికి ఆయనే ఉదాహరణ. ఇక, నాన్నకు యోగాతో అంత అనుబంధం ఏర్పడటానికీ, దాన్ని ఇంత మందికీ చేరువ చేయడానికీ వెనుక ఓ ముఖ్యమైన ఘట్టం ఉంది. ఆయన యువకుడిగా ఉన్నప్పుడు ఎగ్జిమా అనే చర్మవ్యాధి బారిన పడ్డారు. దాంతో చర్మం మందంగా మారిపోయి, దురదతో చాలా ఇబ్బంది పడేవారట. యోగా ద్వారా అది మాయం అయింది. అప్పుడు ధీరేంద్ర బ్రహ్మచారిని గురు దక్షిణ ఏమి ఇమ్మంటారని అడిగితే, నీలాగే పదిమందీ దీని ద్వారా లబ్ధి పొందేలా యోగాను వ్యాప్తి చేయమన్నారట. అలా మా కుటుంబం యోగాకు దగ్గరైంది.

మేం ఏడుగురం పిల్లలం. అమ్మ జోతిష్మతి. ఇంట్లో అందరం యోగా చేసేవాళ్లం. ఇందులో ముఖ్యంగా సూర్యనమస్కారాలు ప్రధానమైనవి. ఇవి శరీరంలోని ప్రతి అవయవాన్నీ యాక్టివేట్ చేస్తాయి. ఇవి చేయడం ద్వారా ఎముకలకు, జీవక్రియకు ప్రధానమైన డి- విటమిన్‌ను సంపాదించుకోవచ్చు. నేను కొన్నేండ్ల ముందు దాకా కూడా ఇవి చేసేదాన్ని. అలాగే ప్రాణాయామం కూడా చాలా ప్రధానం. ఇందులో కూడా చాలా రకాలుంటాయి. నేటికీ ఈ శ్వాస సంబంధిత వ్యాయామాలు చేస్తాను. వెన్నునొప్పి, సైనసైటిస్‌లాంటి రకరకాల జబ్బులు తగ్గించడానికి కూడా యోగా చాలా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా జీవించడానికి ఇది ప్రధానం.

అదే సంతోషం: హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ప్రసూతి వార్డుకు నా పేరు పెట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారం, ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్ అండ్ గైనకలాజిక్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి అవుట్ స్టాండింగ్ కంట్రిబ్యూషన్ అవార్డు, యూకే రాయల్ కాలేజీ వారి గౌరవ ఫెలోషిప్ సహా ఎన్నో పేరెన్నికగన్న అవార్డులు ఈ ప్రయాణంలో అందుకున్నా. అవి నాకు సంతోషాన్ని కలిగించేవే అయినా నేను చేసిన పనికి అమిత ఆత్మసంతృప్తి పొందిన సందర్భాలు వేరే ఉన్నాయి. అందులో ఒకటి చెబుతాను. ఓసారి మెడికల్ క్యాంపు నిమిత్తం ఒక ఊరికి వెళ్లాల్సి ఉంది. డాక్టర్లందరం ఫలానా సమయానికి ఫలానా చోట కలుద్దాం అనుకున్నాం. అయితే నేను ఆ సమయానికి వెళ్లలేకపోయాను. క్యాంపు మిస్సయ్యాను. దీంతో చాలా నిరాశగా వెనుదిరిగాను. ఇంటి తలుపు వేస్తున్నానో లేదో, ఓ ఎమర్జెన్సీ కేసు వచ్చింది. నిండు గర్భిణి. గర్భసంచి పగిలిపోయి లోపలే రక్తం కారిపోతున్నది. అప్పటికప్పుడు సర్జరీ చేసి, బిడ్డనూ, తల్లినీ ఇద్దర్నీ రక్షించా. అప్పుడర్థమైంది నా ప్రయాణం ఎందుకు రద్దయిందో. కొందరు నా దగ్గరికి వచ్చి 'మా అమ్మమ్మకు, అమ్మకు మీరే డెలివరీ చేశారు డాక్టర్ అందుకే కాన్పు కోసం మీ దగ్గరికే వచ్చా' అని చెబుతుంటారు. మూడు తరాలు నా చేతిలోనే పురుడు పోసుకున్న సందర్భాలు ఒక నిండైన అనుభూతిని కలిగిస్తుంటాయి. అలాగే, పెద్ద సమస్యతో వచ్చి మన ద్వారా బాగైన వాళ్ల కళ్లలో కనిపించే ఆనందం నిజంగా చెప్పలేనంత సంతృప్తిని ఇస్తుంది. అది నేను ఇంకా సంపాదించుకుంటూనే ఉన్నా. అదీ నాకు ఓ బలమేనేమో!

అదే సూత్రం: చదువు పూర్తయిన నాటి నుంచి రిటైర్ అయిన దాకా ప్రభుత్వంలో పనిచేశా. మా ఇల్లు సాధారణ జనం ఉండే ప్రాంతంలో ఉంటుంది. వైద్యం కోసం ఇంటిముందుకు వచ్చిన వారిని కాదని అనలేను. వాళ్లందరికీ అందుబాటులో ఉండటమే నాకు కూడా న్యాయమనిపించింది. అందుకే నా దగ్గర ఫీజు తక్కువన్న పేరు వచ్చింది. మా ఇంట్లో కొవిడ్‌కు ముందు వరకూ యోగా కూడా ఉచితంగా నేర్పేవాళ్లం. మెడికల్ కాలేజీలో నా దగ్గర పాఠాలు నేర్చుకున్న వాళ్లలో పేరెన్నికగన్న వైద్యులు ఉన్నారు. వాళ్లకు నేను చదువుతో పాటు విలువల గురించీ చెబుతా. ఎదుటి మనిషి స్తోమతను బట్టి వైద్యంసూచించమంటా. లేదంటే వాళ్లకు అందుబాటులో ఉన్న వైద్యం ఫలానా దగ్గర దొరుకుతుందని అయినా చెప్పమని చెబుతా. రోగులతో మృదువుగా మాట్లాడాలనీ, వారిని చిన్నబుచ్చుకునేలా ఎప్పుడూ చేయొద్దన్న సూచన కూడా నేను పాటిస్తూ వాళ్లకీ చెబుతుంటా.

మీకూ ఆరోగ్యం: మా కాలానికీ ఇప్పటికీ వాతావరణం చాలా మారింది. కాబట్టి మంచి ఆరోగ్యం కోసం నేను కొన్ని విషయాలు చెబుతా. మీరు అపార్ట్‌మెంట్లో ఉన్నా సరే, టెర్రస్ మీదకి వెళ్లి కాసేపు చిన్నపాటి వ్యాయామం చేస్తూ ఎండ తగిలేలా కొంత సమయం గడపండి. శరీరం చురుగ్గా ఉండటానికి ఇది చాలా ప్రధానం. పురుగుమందులు విపరీతంగా వాడుతున్న ఈ తరుణంలో పండ్లు, కూరగాయలు బాగా కడిగి తినాలి. వాయుకాలుష్యం తట్టుకునేందుకు శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయండి. పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే బాగా ఆటలు ఆడించాలి. యుక్త వయసు వచ్చిన ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా వాళ్లను కొన్ని క్యాన్సర్‌ల నుంచి కాపాడుకోవచ్చు. ఇక మితాహారం, అందులోనూ సమతులాహారం మనల్ని దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆహారం ఎలా తీసుకోవాలన్న దానికి నాన్న చెప్పే సూత్రం ఒకటి చెబుతా 'డ్రింక్ సాలిడ్స్ ఈట్ లిక్విడ్స్'. ఘన పదార్థాలను తాగేందుకు అనుకూలం అన్నంత మెత్తగా నమిలి మింగాలి. అప్పుడు లాలాజలంతో ఊరే ఎంజైమ్‌ల ద్వారా అది హాయిగా జీర్ణం అవుతుంది. ద్రవ పదార్థాలను తిన్నట్టుగా అంటే నెమ్మదిగా కొద్ది కొద్దిగా చప్పరిస్తూ మింగాలి. అప్పుడు జీర్ణవ్యవస్థ అద్భుతంగా ఉంటుంది. అన్నింటినీ మించి మనసును శాంతంగా ఉంచుకోండి. ధర్మంగా బతకండి. బాబా చెప్పినట్టు నేను సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అనే నాలుగింటినీ పాటిస్తాను. ఇప్పటికీ వీటన్నిటినీ సాధించడానికే నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాను. ప్రయత్నిస్తే మీరూ వీటిని అందుకుంటారు. ఆల్ ద బెస్ట్!

కొందరు నా దగ్గరికి వచ్చి 'మా అమ్మమ్మకు, అమ్మకు మీరే డెలివరీ చేశారు.. అందుకే కాన్పు కోసం మీ దగ్గరికే వచ్చా' అని చెబుతుంటారు. మూడు తరాలు నా చేతిలోనే పురుడు పోసుకున్న సందర్భాలు ఒక నిండైన అనుభూతిని కలిగిస్తుంటాయి.

## 'గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పక్కాగా అమలు చేయాలి'

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

రాజేంద్రనగర్: చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అల్ట్రా సౌండ్ /స్కాన్ కేంద్రాల పనితీరు చట్టపరమైన నిబంధనల అమలు, లింగ నిర్ధారణ నిరోధానికి తీసుకుంటున్న చర్యలపై, జిల్లా వైద్యం, ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ కే లలిత దేవి అధ్యక్షతన విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా లలితాదేవి మాట్లాడుతూ... నిబంధనకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు 19 దరఖాస్తులు వచ్చాయని, రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు 20 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెన్యూవల్ దరఖాస్తులు కమిటీ ముందు ప్రతిపాదించడం జరిగిందన్నారు. అన్ని దరఖాస్తులు పిసిపిఎన్‌డి టి చట్టంలోని నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతికి జిల్లా స్థాయి కాంపిటెంట్ అథారిటీకి నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. పి సి పి ఎన్ డి టి చట్టాన్ని కఠినంగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వంటి అక్రమ చర్యలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డాక్టర్ వినోద్, డాక్టర్ రాకేష్, డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీతో పీకే మంతనాలు..!



న్యూఢిల్లీ, : రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. ఉండేది కేవలం శాశ్వత ప్రయోజనాలు మాత్రమే. ఈ నానుడిని నిజం చేస్తూ.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ తాజాగా కాంగ్రెస్ అగ్రనా యకురాలు ప్రియాంక గాంధీతో భేటీ కావడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు కాంగ్రెస్ నాయకత్వంపై అసహనంతో సొంత కుంపటి పెట్టుకున్న పీకే, ఇప్పుడు మళ్లీ అదే పార్టీ గడప తొక్కడానికి ప్రధాన కారణం.. ఇటీవలి బీహార్ ఎన్నికల ఫలితాలే అని చెప్పొచ్చు. ఇటు కాంగ్రెస్, అటు జన్ సురాజ్.. రెండూ ఘోర పరాజయాన్ని చవిచూసిన వేళ, ఈ కలయిక భవిష్యత్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతోందా అనే ఆసక్తి నెలకొంది.పీకే ? ప్రియాంకల భేటీకి కారణం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రశాంత్ కిశోర్ ఎంతో ప్రతిష్టాత్మ కంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి బీహార్ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. మొత్తం 238 స్థానాల్లో పోటీ చేస్తే, ఒక్క సీటు కూడా గెలవకపోగా.. ఏకంగా 236 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. "వ్యూహకర్తగా గెలిపించడం వేరు.. నాయకుడిగా గెలవడం వేరు" అనే సత్యాన్ని ఈ ఫలితాలు పీకేకి రుచి చూపించాయి.మరోవైపు కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతకంటే భిన్నంగా ఏమీ లేదు. మహాకూ టమిలో భాగంగా 61 సీట్లలో పోటీ చేసిన హస్తం పార్టీ, కేవలం 6 సీట్లకే పరిమితమైంది. ఈ ఫలితాలు రెండు పార్టీల అస్తిత్వాన్నే ప్రశ్నించేలా మారాయి. ఈ నేపథ్యంలోనే, ఇద్దరు పరాజితులు కలిసి భవిష్యత్ ప్రయాణం సాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నిజానికి ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ గూటికి చేరడం ఇది కొత్తేమీ కాదు. జేడీయూ నుంచి బయటకు వచ్చాక, ఆయన కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనం కోసం ఒక బృహత్తర ప్రణాళికను సోనియా గాంధీకి సమర్పించారు. గాంధీ కుటుంబం కాని వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పజెప్పడం దగ్గరి నుంచి, సంస్థాగత నిర్మాణం వరకు అనేక సంచలనాత్మక మార్పులను ఆయన సూచించారు. అయితే, సోనియా గాంధీ ఆ నివేదిక పరిశీలనకు ఒక కమిటీని వేసి, పీకేను ఆ కమిటీలో ఒక సభ్యుడిగా చేరమన్నారు. కానీ, నిర్ణయాధికారాలు లేని కమిటీలో ఉండలేనని, తనకు ఫ్రీ హ్యాండ్ కావాలని పీకే పట్టుబట్ట డంతో ఆ చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాతే ఆయన జన్ సురాజ్ యాత్రను ప్రారంభించారు.సోనియా గాంధీ హయాంలో విఫలమైన చర్చలు, ఇప్పుడు ప్రియాంక గాంధీ చొరవతో మళ్లీ చిగురించడం ఆసక్తికరం. ప్రస్తుతం కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత క్రియాశీలకంగా ఉన్నది ప్రియాంకే. ఆమెతో పీకే భేటీ అవ్వడం వెనుక రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో సొంత పార్టీని నిర్మించి, క్యాడర్ ను తయారు చేసుకోవడం ఎంత కష్టమో పీకేకి బీహార్ ఎన్నికలు అర్థం చేయించాయి. ఇప్పటికే బలమైన ఓటు బ్యాంకు, చరిత్ర ఉన్న కాంగ్రెస్ లాంటి ప్లాట్ ఫామ్ పై తన వ్యూహాలను అమలు చేయడం సులువని ఆయన భావిస్తుండవచ్చు.వరుస ఓటములతో కునారిల్లుతున్న కాంగ్రెస్ కు, కేవలం సిద్ధాంతాలు మాత్రమే సరిపోవు.. గెలిచే వ్యూహం కావాలి. ఆ లోటును భర్తీచేయగల సత్తా పీకేకి ఉందని అధిష్టానం నమ్ముతోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రశాంత్ కిశోర్ మళ్లీ కాంగ్రెస్ కోసం పనిచేసేందుకు కొన్ని తాజా ప్రతిపాదనలతో వచ్చినట్లు తెలుస్తోంది.

అయితే ఈసారి ఆయన పాత్ర కేవలం ఎన్నికల వ్యూహకర్తగా ఉంటుందా? లేక పా ర్టీలో చేరి కీలక పదవిని చేపడతారా? అన్నది తేలాల్సిఉంది. జన్ సురాజ్ ను కాంగ్రెస్ లో విలీనంచేస్తారా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో, టికెట్ల కేటాయింపులో తనకు స్పష్టమైన పాత్ర కావాలనిపీకే కోరుతున్నట్లు సమాచారం.మొత్తానికి, బీహార్ ఎన్నికల ఫలితాలు ప్రశాంత్ కిశోర్ కు వాస్తవికతను, కాంగ్రెస్ కు అనివార్య తను గుర్తుచేశాయి. ప్రశాంత్ కిశోర్ దగ్గర బ్లూ ప్రింట్ ఉంది,

కాంగ్రెస్ దగ్గర బ్రాండ్ ఉంది. ఈ రెండూ కలిస్తేనే బీజేపీ వంటి బలమైనశక్తిని ఎదుర్కో గలమని ఇరువురూ గ్రహించినట్లు కనిపి స్తోంది. ప్రియాంక గాంధీతో జరిగిన ఈ భేటీ.. కేవలం చర్చలకే పరిమితమవుతుందా లేక కాంగ్రెస్ వార్ రూమ్ లో పీకే మళ్లీ చక్రం తిప్పుతారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## తీవ్ర పేదరికానికి చెక్ పెట్టేందుకు బ్రెజిల్ కృషి...!

ఆసియాలో చైనా, భారతదేశంలో కేరళ రాష్ట్రం తీవ్ర పేదరికం నుంచి ప్రజల్ని విముక్తి చేశాయి. ఇప్పుడు అదే బాటలో లాటిన్ అమెరికాలో మెక్సికో, బ్రెజిల్, హొూండురాస్ దేశాలు కూడా ప్రజల్ని తీవ్ర పేదరికం నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయా దేశాల్లోని ప్రజలకు, అందునా తీవ్ర పేదరికంలో మగ్గుతున్న వారికి కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన, వంటివి అందిస్తూ ప్రపంచానికే ఓ సందేశాన్నిస్తున్నాయి. ముఖ్యంగా ఈ దేశాలు గతంలోనూ, ఇప్పుడు సోషలిస్టు ప్రభుత్వాలు పాలన ఉండడమే దీనికి కారణం. ప్రపంచంలో పెట్టుబడిదారీ దేశాలే ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతుంటే.. సోషలిస్టు ప్రభుత్వాలున్న దేశాలు చిన్నవీ.. అందునా ఆర్థిక ఆంక్షలు, వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణకు పూనుకుంటున్నాయి. ఆ విధమైన విధానాలే అవలంబిస్తుండడం గమనార్హం. లాటిన్ అమెరికాలో ఉన్న మెక్సికో, బ్రెజిల్ దేశాలు తీవ్ర పేదరికం లేకుండా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు లాటిన్ అమెరికా అండ్ కరేబియన్ ఆర్థిక కమిషన్ అయిన సిఇపిఎఎల్ తాజా నివేదిక వెల్లడించింది. తాజా నివేదికలో లాటిన్ అమెరికాలో పేదరికం అత్యల్ప స్థాయిలో ఉంది. 2024లో తీవ్ర పేదరికం 25.1 శాతం నుండి 9.8 శాతానికి తగ్గిందని ఈ నివేదిక పేర్కొంది.

ముఖ్యంగా తీవ్ర పేదరికాన్ని అంతం చేసేందుకు బ్రెజిల్, మెక్సికో సాధించిన పురోగతి.. భవిష్యత్తులో లాటిన్ అమెరికా అంతటా విస్తరించే అవకాశం ఉందని.. ఆయా దేశాల్లో (అర్జెంటీనా, చిలీ, కొలంబియా, క్యూబా, ఈక్వెడార్ హొూండురాస్) తగ్గే అవకాశం ఉంది అని ఈ నివేదిక స్పష్టం చేసింది.

2024లో తీవ్ర పేదరికం తగ్గడానికి మెక్సికో, బ్రెజిల్ తీసుకున్న విధానాలు, పనితీరే కారణం. మెక్సికో – బ్రెజిల్ 60–30 శాతం వాటా కలిగి ఉన్నాయి. మెక్సికో 90 శాతం అయితే.. బ్రెజిల్ 80 శాతం తీవ్ర పేదరికం తగ్గుదలకు దోహదపడ్డాయి. మెక్సికో, బ్రెజిల్‌లు అధిక జనాభా కలిగిన దేశాలు అయినప్పటికీ.. లాటిన్ అమెరికా జనాభాలో సగం కటే తక్కువ మాత్రమే ఉన్నాయి. 2018లో మెక్సికోలో మొరానా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి 13.4 మిలియన్ల మందినీ తీవ్ర పేదరికం నుండి బయటకు తీసుకొచ్చింది. పేదరికాన్ని తగ్గించడంలో హొూండురాస్ ప్రజాస్వామ్య సోషలిస్టు ప్రభుత్వం కూడా విజయం సాధించింది.

హొూండురాస్ వివరాల్లోకి వెళితే..

2021 ఎన్నికల నుండి గమనిస్తే.. పేదరికంలో ఉన్న కుటుంబాల శాతం 73.6 శాతం నుండి 62.9 శాతానికి తగ్గింది. ఇక తీవ్ర పేదరికంలో ఉన్న కుటుంబాల శాతం 53.7 శాతం నుండి 40.1 శాతానికి తగ్గింది. మొత్తంగా 2024కి పేదరిక రేటు 73.6 శాతం నుండి 60.1 శాతానికి తగ్గింది. ఇక తీవ్ర పేదరిక రేటు 53.7 శాతం నుండి 38.3 శాతానికి తగ్గింది.

2009 నుండి 2021 వరకు 73.6 శాతం నుండి 58.8 శాతానికి తగ్గినట్లు సిఇపిఎల్ నివేదిక పేర్కొంది. పేదరికం తగ్గడానికి ప్రధాన కారణం 2022 నుండి కనీస వేతనంలో 82 శాతం పెరుగుదల ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో 30న లిబ్రే పార్టీ ఓడిపోయింది. అయితే ప్రజాస్వామ్య సోషలిస్టు ప్రభుత్వానికి నేతృత్వం వహించిన లిబ్రే పార్టీ పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలని ప్రస్తుత అధికారంలో ఉన్న రైట్‌వింగ్ డెమోక్రటిక్ పార్టీని కోరింది.

అర్జెంటీనా, పెరూ, పరాగ్వే, ఈక్వెడార్, బొలీవియా వంటి దేశాల్లో మితవాద పార్టీలే పాలిస్తున్నాయి.

ఒక్క హొూండురాస్‌లోనే ప్రజాస్వామ్య సోషలిస్టు ప్రభుత్వం కొనసాగింది. అది ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓడిపోయింది. అయినప్పటికీ ఆ ప్రభుత్వం పేదరికాన్ని తగ్గించడానికి తీవ్రంగా కృషి చేసింది. ఇక బ్రెజిల్, మెక్సికోల్లో సామాజిక దృష్టి ఉన్న ప్రభుత్వాలు అధికారంలో ఉండడంతో.. పేదరికాన్ని తగ్గించడంలో, వారి పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి.

కొలంబియాలోని గుస్తావో పెట్రో కనీస వేతనాన్ని పెంచడం, పేదరికాన్ని తగ్గించడంలో కొంత పురోగతి సాధించారు. కానీ మెజారిటీ మద్దతు లేకపోవడం, ఇతర అడ్డంకుల కారణంగా రాజ్యాంగ సవరణలను ఆమోదించడంలో ఇబ్బంది పడుతున్నారు. క్యూబా, నికరాగ్వా, వెనిజులాలు అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సోషలిస్టు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.



# విద్వేషం.. హింస



స్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.

విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే ఇలాంటి మారణ హెూమాలకు సంజాయిషీ చెప్పాలి.

పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.

ఒక ఘటన జరగ్గానే ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందుకోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు.

అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినప్పుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తే.. అది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ. భిన్నత్వం లో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వా న్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లాంటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహెూమాలకు విరుగుడు.

## డిజైనింగ్ లోపాలతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు

### -శాశ్వత పరిష్కారం కోరిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి :తిరుపతి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల వద్ద వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యల గూర్చి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. చిన్నపాటి వర్షాలకే కొన్ని అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలవడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారడం తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ సమాదనం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు, సబ్‌వేలలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు మార్గాలు, క్రాస్ డ్రైన్లు, జాయింట్ సీలింగ్, ఎంట్రీ వద్ద హంప్‌లు, కవర్ల షెడ్‌లు, అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అసాధారణ వర్షపాతం సమయం లో ట్రాఫిక్ నిలిపివేయడం, హెచ్చరిక బోర్డులు, గేటు బారియర్లు, వాచ్‌మన్‌ల నియామకం వంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి, మొత్తం 43 రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు ఉన్నాయని, గత వర్షాకాలంలో గూడూరు, రేణిగుంట సెక్షన్ లో చెర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి లోని మూడు అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలిచి సమస్య వచ్చిందని, దానిని పంపింగ్ ద్వారా పరిష్కరించినట్లు సమాధానంలో పేర్కొన్నారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో రూ.208 కోట్ల వ్యయంతో 6 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జ్‌లు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. మొత్తంగా సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించిందని, తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కా రాల దిశగా పనులు జరుగుతున్నా యని మంత్రి తన సమాదనంలో తెలియజేశారు. అయితే డిజైన్ లోపాలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. స్థానిక మున్సిపల్ సంస్థలతో సమన్వయంతో సమగ్ర డ్రైనేజ్ పరిష్కారాలపైపని చేస్తున్నామని మాత్రమే తెలిపారు. ఈ అంశంపై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జ్‌లలో వర్షాకాలం నీరు నిలవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా కూడా కొన్ని అండర్ బ్రిడ్జ్‌లు నీటితో నిండిపోవడం చూస్తుంటే స్పష్టమైన డిజైన్ లోపాలు, సమగ్ర డ్రైనేజ్ ప్రణాళిక లేకపోవడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక పంపింగ్ ఏర్పాట్లకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జ్‌లలో సరైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జ్‌లలో డిజైన్ ఆడిట్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

## అక్కరకు కాని సంక్షేమ పధకాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను హస్తగతం చేసుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పైకి చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పోరులో బీఆర్‌ఎస్ గ్రాఫ్ అనూహ్యంగా పెరగడం, రెండు వేలకు పైగా సర్పంచ్ స్థానాలు గెలుచుకోవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అంతర్మథనం మొదలైంది. అనుకున్న లక్ష్యానికి ఎందుకు చేరుకోలేపోయామనే అంశంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందిడీసీసీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సీరియస్‌గా పనిచేయలేదని.. అసంతృప్తులను, అసమ్మతిని బుజ్జగించి దారిలోకి తీసుకురావడంలో డీసీసీ అధ్యక్షులతో పాటు ఎవెమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీనాయకులువిఫలమయ్యారనే విమర్శ లు వినిపిస్తున్నాయి. రెబల్స్‌ను బుజ్జగించి.. పోటీ నుంచి తప్పించకు ండా వదిలేయడం వల్లే పంచాయతీ పోరులో అనుకున్న లక్ష్యం సాధించలేకపోయామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి వల్లే ఓట్లు బాగా చీలి బీఆర్‌ఎస్, బీజేపీ లాభపడ్డాయి అని అంటున్నా రు. అంతేకాకుండా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలోనూ వెనకబడిపోయినట్లుగా కాంగ్రెస్ నేతలు గుర్తించినట్లుగా గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే 70 నుంచి 80 శాతం వరకు సర్పంచ్‌లను గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్న విషయం తెలిసిందేకానీ, రెండు విడతల్లో 8,555 గ్రామాల్లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ 4,579 పంచాయతీల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక బీఆర్‌ఎస్ 2,3 57, బీజేపీ 457, ఇతరులు 1,162 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందారు. రెండు విడతల్లో వచ్చిన ఫలితాలు మూడో విడతలో పునరావృతం కాకుండా జగ్రత్తపడాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి నాయకు డు అప్రమత్తంగా ఉండాలని గాంధీభవన్ నుంచి డీసీసీ అధ్యక్షులు, స్థానిక నాయకులకు ఆదేశాలు వెళ్లినట్లుగా తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే, త్వరలోనే పార్టీపరంగా జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పోరేషన్ల ఎన్నికల్లో నష్టం జరుగుతుందని పార్టీ పెద్దలు హెచ్చరిక కూడా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వెయ్యిలోపే సర్పంచ్‌లు గెలుస్తుందని కాంగ్రెస్ నేతలు మొదటి నుం చి భావించారు. కానీ, ఫలితాలు చూస్తే ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు చెబు తున్నారు. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీ నాయకుల్లో కొందరు పనిచేసినా.. మరికొందరు పెద్దగా దృష్టి సారించలేదని, అందుకే సగంస్థానాలకే పరిమితం కావాల్సి వచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్నా ఫలితాలు ఆశించిన మేర ఫలితాలు రాలేదనే చర్చ జరు గుతోంది. మరోవైపు బీఆర్‌ఎస్ స్థానిక క్యాడ ర్ పంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని.. కాంగ్రెస్‌కు ధీటుగా పనిచేసి 2 వేలకు పైగా సర్పంచ్‌లను గెలిపించుకున్నారని చర్చ జరుగుతోంది బీజేపీకూడా ఊహించని విధంగా ఫలితాలను సాధించుకుంది. రెండు విడతలు కలిపి 457పంచాయతీలు గెలవడంపై ఆపార్టీ రాష్ట్ర నాయ కత్వమే ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది.

## హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది.'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకు ఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్–19 మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులు ఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతుల జీవులు ఉన్నాయి. త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడ జీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

## ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్


మాస్కో : క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు. ఈ వ్యాక్సిన్ ఎఖీఔం సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్‌క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ ? మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్?వీ' అనే పేరు ప్రతిపాదించారు. మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30?50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు. 2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10




కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా. ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.

## ఆగని పైరసీ..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నిం చారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు. రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీ అవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు. మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు. రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే. మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ



ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. ఆఖీఓ టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు. అదే సమయంలో.. ఆడియో కూడా రికార్డ్ అయ్యేది. అలా రికార్డ్ అయిన సినిమాల్ని ఐబొమ్మ, బొప్పం వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు. రవి అరెస్టు అయిన తర్వాత కూడా ఓటీటీ సినిమాలు పైరసీ అవుతూనే ఉన్నాయి. చాలా మంది ఆఖీఓని వాడి.. పైరసీ చేస్తున్నారు. అంటే.. రవి అనే వ్యక్తి.. ఈ పైరసీ మాఫియాలో కింగ్ కాదు. అతని అరెస్టుతో పోలీసులు సాధించేది ఏమీ లేదని తేలిపోతోంది.



## పిల్లలకు జ్ఞానం ముఖ్యం.. ర్యాంకులు, మార్కులు కాదు..

# బతుకునిచ్చే చదువులెక్కడ..?

భారతదేశంలో సగటున ప్రతి 55 నిముషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడు. వీళ్లలో ఎక్కువమంది ఒత్తిడి, ఆందోళన వల్లే చనిపోతున్నారని సైకాలజిస్టులు చెప్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ.. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ భారతదేశంలో జీవన నైపుణ్యాల గురించి ఒక సర్వే చేశాయి. ఆ సర్వే చూసిన నిపుణులు విద్యార్థులు సూసైడ్ లెటర్ రాసి మరీ ఆత్మహత్యలు చేసుకోవడం. ఆశ్చర్యంగా ఉంది. పదో తరగతి లోపు విద్యార్థులు కూడా ఆత్మహత్యలు చేసుకోవడం గురించి ఆలోచిస్తున్నారు..ఈ పరిస్థితుల నుంచి పిల్లల్ని బయటపడేయాలంటే వాళ్లకు చిన్నప్పటి నుంచే లైఫ్ స్కిల్స్ నేర్పించాలి అంటున్నారు.

బుర్ర బంద్ పెట్టు. బట్టీ బాగా పట్టు. స్కూల్లో చేరిన దగ్గర్నించీ ఇదే ఈక్వేషన్? తో నడుస్తున్నాయి చదువులు. అసలు చదువంటే ఏంటి? చదువుతో పాటు బుర్ర పెరగాలి. అంతేగానీ మార్కుల కోసమో, ర్యాంకుల కోసమో కాదు కదా! ఈ విషయం తెలియదా అంటే... అందరికీ తెలుసు... కానీ చదువనే రేస్?లో మేం ముందున్నామంటే ... మేమున్నామనే పోటీలో పిల్లల్ని దేనికి దూరం చేస్తున్నారో అర్థం చేసుకోవడం లేదు. కావాల్సింది బతుకునిచ్చే చదువులే కానీ బట్టీ పట్టే చదువులు కాదు.

17 ఏళ్ల సచిన్ ఆత్మహత్యకు ప్రయత్నించి అదృష్టవశాత్తు బయటపడ్డాడు. ఈ పని ఎందుకు చేశావని అడిగితే... 'మార్కులు తక్కువ వస్తే కాలేజీలో చిన్న చూపు చూస్తున్నారు. దాంతో నేనెందుకూ పనికిరానా... అదే ఫీలింగ్ కలిగిందని చెప్పాడు.

ఇది ఈ అబ్బాయి ఒక్కడే సమస్యే కాదు. ఎక్కువమంది పిల్లలు ఇంచుమించు ఇలాంటి సమస్యలతోనే ఇబ్బందిపడుతున్నారు. వాళ్లకు ఏదో చేయాలని ఉంటుంది. కానీ తల్లితండ్రులు ర్యాంకుల వేట, కాలేజీల ఒత్తిళ్ల మధ్య నలిగిపో తున్నారు.

ముక్కున పట్టి చదివేస్తే పోతుందని నాలుగు పాఠాలు బట్టిపెట్టి పరీక్షలు రాస్తున్నారే తప్ప సబ్జెక్టును అర్థంచేసుకునే ప్రయత్నం చేయడంలేదు. అలా చదవడం వల్ల జీవితంలో ఏ చిన్న సమస్య వచ్చినా తట్టుకునే మానసిక స్థైర్యం ఉండకుండా పోతోంది.

రోజుకు ఎన్ని గంటలు చదువుతున్నారు? చదివేదంతా వాళ్ల మెదడులోకి ఎక్కుతుందా? లేదా? పాఠాన్ని అర్థం చేసుకుని చదువుతున్నారా... ఇలాంటి వాటితో సంబందం లేదు. మొదటి ర్యాంకు వచ్చిందా లేదా అంతే. కాలేజీలు రోజులో ఎన్ని గంటలు చదవాలి? ఏ టైంలో ని సబ్జెక్టు చదవాలి? టార్గెట్ లు ఇచ్చి విద్యార్థుల పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇలాంటి అత్యాధునిక విద్యావిధానాన్ని ప్రశ్నించే కథే.. మహాభార తం... అరణ్యపర్వంణలోని అష్టావక్రుని చరిత్ర. జ్ఞానవంతులు కావడానికి వయసుతో సంబంధం లేదని కూడా ఈ కథ తెలియజేస్తుంది.

మహాభారతంలో పాండవులు అరణ్యవాసం చేస్తూ ఆయా స్థలాలగొప్ప తనం, చరిత్రలగురించి తెలుసుకుంటూ ఉంటారు. రోమశుడనే ముని పండ్లతో నిండిన తోటను చూపించి ఇవి శ్వేతకేతు ఆశ్రమమని.. అష్టావక్రుడు, శ్వేతకేతులు ఇద్దరూ మేనల్లుడు..మేనమా మలని అంటా డు.ధర్మరాజు అష్టావక్రునిగురించి చెప్పమని అడుగుతా డు. అందుకు రోమశుడు అష్టావక్రుని కథను వివరంగా చెప్పాడు.

**అతిగా చదవడం అనర్ధమే!:** ఏకపాదుడు గొప్ప విద్యాంసుడు. సుజాత అనే యువతిని వివాహం చేసుకుంటాడు. ఆమె గర్భవతి అవుతుంది. ఏకపాదుడు తన ఆశ్రమంలో శిష్యులచేత ఎప్పుడూ వేదాలు చదివిస్తూ, వాళ్లకు విశ్రాంతి ఇచ్చేవాడు కాదు. సుజాత గర్భంలో ఉన్న శిశువు తండ్రి చేస్తున్న వేదాధ్యయన పద్ధతి సరైనది కాదని గ్రహిస్తాడు. తీరిక లేకుండా శిష్యుల చేత చదివించడం వల్ల కలిగే నష్టాల గురించి తండ్రికి చెప్తాడు. "వాళ్లచేత పగలనక, రాత్రనక ఎడతెరిపి లేకుండా చదివించడం చేత మందబుద్ధులుగా తయారవుతారు. నిద్రలేక పోవడం వల్ల వేదపాఠాలను తప్పుగా చదువుతున్నారు. ఈ విధంగా చదివించడం ఎందుకు?" అని ప్రశ్నిస్తాడు. అందుకు ఏకపాదుడు భార్య గర్భంలో ఉన్న కొడుకు పై కోపంతో "నీవు విద్యావిధానాన్ని వక్రంగా విమర్శించావు. కాబట్టి అష్టావక్రుడివై పుడతావని శపిస్తాడు. తండ్రి శాపం వల్ల కొడుకు ఎనిమిది వంకర్లతో పుడతాడు. అయితే అప్పటికి ఏకపాదుడు జనక మహారాజు సభకు వెళ్లి, అక్కడ వరుణుడి కొడుకైన నందితో వాదించి ఓడిపోతాడు. సగం నీటిలో మునిగి శక్త అనుభవిస్తూ ఉంటాడు.

**చదువంటే...ఇలా!:** బట్టి చదువుల వల్ల పూర్తి అవగాహన రాదు. కేవలం చదివే విషయం మాత్రమే నోటికి వస్తుంది. అంశాన్ని అర్థం చేసుకుని చదవడం పట్ల మాత్రమే సంపూర్ణ జ్ఞానం వస్తుంది. అష్టావక్రుడు అలా చదవడం వల్లే గొప్ప జ్ఞానవంతుడయ్యాడు. తండ్రి కంటే ఎక్కువ తెలివితేటలు వచ్చాయి. తండ్రిపై గెలిచిన వాళ్లను సైతం ఓడించాడు. లోతైన అధ్యయనం, అవగాహన లేకుండా పైపై చదువులు దండగని అష్టాదక్షుని చరిత్ర తెలియజేస్తుంది. అలాగే చదువుకు, జ్ఞానానికి వయసుతో సంబంధం లేదు చిన్నవాళ్లైనా కొందరికి అపారమైన ప్రతిభ ఉంటుంది. అలాంటి వాళ్లను గౌరవించాలి మరికొందరికి వయను పెరిగినా వ్యక్తిత్వం పెరగదు. విలువలతో జీవించరు. చెప్పే మాటలను చదివిన విషయాలను జీవితానికి అన్వయించుకోరు. అలాంటప్పుడు ఎంత జ్ఞానం ఉన్న దండగే. గర్వం పనికిరాదు. అది చదువును, వ్యక్తిత్వాన్ని కుందింపజేస్తుంది. మనిషికి వయసుకన్నా ప్రతిభ ముఖ్యం.. వయసులో చిన్నవాళ్లకు జ్ఞానం, మంచి ప్రవర్తన ఉంటే వాళ్లను తప్పక గౌరవించాలి. గొప్పవాళ్లుగా గుర్తించాలి.

**వయసు... ప్రతిభ:** ష్టావక్రుడు మేనమామ శ్వేతకేతుతో కలిసి ఉద్దాలకుడనే ముని దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకుంటాడు. తన తండ్రి జనకమహారాజు దగ్గర బందీగా ఉన్నాడని తెలుసుకుని, విడిపించడానికి శ్వేతకేతుతో కలిసి వెళ్తాడు.. వయసులో చిన్నవాడివి, ఆశ్రమంలో యాగం జరుగుతోంది. వయసులో పెద్దవాళ్లకు, అనుభవంతో యజ్ఞం చేయించగల వాళ్లకి మాత్రమే అనుమతి. మీకు లేదని అక్కడి వాళ్లు అష్టావక్రుడు, శ్వేతకేతులను ఆపుతారు. అందుకు అష్టావక్రుడు చాలా సంవత్సరాలు ఓర్పుతో బతకడం, వెంట్రుకలు తెల్లబడటం ముసలితనానికి గుర్తులా..? జ్ఞానం ఉన్న బాలుడైనా ఈ భూమి మీద వృద్ధుడే.!.

చదువుకోవటం, ఆచదువునునిత్యజీవితంలో ప్రతిఫలించేటట్లు సడుచుకోవటం వల్లే జ్ఞానం వస్తుంది. అలా నడుచుకునే వాళ్లు వయసులో చిన్నవాళ్లైనా.. ప్రజలందరి చేతా మన్నించదగిన వాళ్లుకాబట్టి మమ్మల్ని చిన్నవాళ్లని అవమానించవద్దు. జనకమహా రాజు సభలో గర్వంతో విర్రవీగేవాళ్లను ఓడించడానికి వచ్చామని చెప్తాడు. లోపలికి వెళ్లి సభ జనకమహారాజు అడిగిన చిక్కు ప్రశ్నల న్నింటికి అష్టావక్రుడు సమాధానాలు చెప్తాడు. వరుణుడి కొడుకైన పందితో అనేక విషయాల గురించి వాదించి, చర్చించి గెలుస్తాడు. చివరకు అతడి దగ్గర ఓడిపోయిన వారందరితోపాటు, తండ్రిని కూడా విడిపిస్తాడు. జనకమహారాజు చేత సన్మానం పొందుతాడు.

# ఎదురొడ్డి నిలబడేలా..



పిల్లలు-యువతలో ఆత్మహత్యలు పెరుగుతుండటం.. ఆందోళన కలిగిస్తున్నది. 2023లో 13,892 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకున్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక చెబుతున్నది. అంతేకాదు.. దేశంలోని టీనేజర్లలో 22 శాతం మంది క్లినికల్ డిప్రెషన్‌తో బాధపడుతున్నారని లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఆసియా జర్నల్ - 2024 అధ్యయనం తేల్చింది. ఈ క్రమంలో పిల్లల్ని మానసికంగా దృఢంగా తయారుచేయాల్సిన అవసరం ఉన్నది. నేటితరం పిల్లలు మునుపటికంటే ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. చదువులో పోటీ, సోషల్ మీడియా ప్రభావం, కుటుంబ అంచనాలు.. ఇవన్నీ వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వీటన్నిటినీ సమర్థంగా ఎదుర్కోవాలంటే.. పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇందుకోసం.. బాల్యం నుంచే వారిని మానసికంగా దృఢంగా తయారుచేయాలి. అందుకు ఈ సలహాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ముందుగా పిల్లల భావోద్వేగాలను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి అవకాశం ఇవ్వాలి. కోపం, విచారం లాంటివి ఎదురైనప్పుడు ఎలా ప్రవర్తించాలో నేర్పించాలి. భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేలా చూడాలి. అలాగే, పరిస్థితులకు అనుకూలంగా ఎలా వ్యవహరించాలో.. వాస్తవికంగా ఎలా ఆలోచించాలో అవగాహన కల్పించాలి. అప్పుడే వారిలో సానుకూల దృక్పథం అలవడుతుంది. పిల్లలకు బాల్యం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. పోషకాహారం తీసుకోవడంతోపాటు ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారాన్ని దూరం పెట్టేలా వారిని ప్రోత్సహించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం వంటివి కూడా పిల్లల మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయి. ఇక వ్యాయామం వల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చిన్నచిన్న సమస్యలు వారినే పరిష్కరించుకోవాలని చెప్పాలి. సమస్యలు ఎదురైనప్పుడు సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం ఇవ్వాలి. అప్పుడే వారు జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా స్వీకరిస్తారు. ఆత్మవిశ్వాసంతో ఉండగలుగుతారు. తల్లిదండ్రులను గమనించడం ద్వారానే పిల్లలు ఎక్కువగా నేర్చుకుంటారు. వివిధ పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో మిమ్మల్ని చూసే అనుకరిస్తారు. మీ అలవాట్లను, మీ లక్షణాలను గ్రహించే.. వాటికి అనుగుణంగా ప్రవర్తిస్తుంటారు. కాబట్టి, మీ చర్యలు, పరిస్థితులు- సంఘటనలకు మీరు స్పందించే తీరును ఒకసారి బేరీజు వేసుకోండి. మీ అలవాట్లలో ఏవైనా లోపాలు ఉంటే.. వెంటనే సరిదిద్దుకోండి. మీరే మీ పిల్లలకు రోల్ మోడల్‌గా మారండి. క్రమశిక్షణ అంటే.. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే, వారిని దండించడం కాదు. ఆ తప్పును పునరావృతం చేయకుండా చేయడం. కాబట్టి, స్వీయ-క్రమశిక్షణ, నియంత్రణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలపై సందర్భానుసారం అవగాహన కల్పించాలి. మెదడు అభివృద్ధికి, ఆరోగ్యానికి సాయపడే ఆహారాన్ని అందించాలి. పాఠ్యపుస్తలతోపాటు కథల పుస్తకాలు చదవడం అలవాటు చేయించాలి. దీనివల్ల భాషా నైపుణ్యాలతోపాటు వారిలో కమ్యూనికేషన్ కూడా మెరుగుపడుతుంది. వారి మెదడు అభివృద్ధికి తోడ్పడుతుంది.

## ఆరోగ్యానికి చేప నూనె

వంటల్లో ఉపయోగించే రకరకాల నూనెలు.. ఆరోగ్యానికి మంచి కన్నా చెడే ఎక్కువ కలిగిస్తాయి. అనేక పరిశోధనలు కూడా ఇదే విషయాన్ని వెల్లడించాయి. అందుకే, ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు నూనెలను అల్లంత దూరం పెడతారు. వాటిని అనుమానాస్పద దృష్టితోనే చూస్తారు. అయితే, శరీరానికి మేలుచేసే నూనెలు కూడా కొన్ని ఉన్నాయి. గుండె ఆరోగ్యం మొదలుకొని,

పోషకాహారం వరకు.. మీ శారీరక, మానసిక ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. అందులో ముఖ్యమైనది.. చేప నూనె. దీని ప్రయోజనాలు అనేకం.

నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం.. చేప నూనెలో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికశాతం లభిస్తాయి. ముఖ్యంగా, సాల్మన్, మాకేరెల్, ట్యూనా, హెర్రింగ్, సార్డిన్ వంటి చేపలలో ఈ ఒమేగా-3 ఎక్కువగా ఉంటుంది. ఇది, మన ఆరోగ్యానికి ఎన్నోరకాలుగా ఉపయోగపడుతుంది. మూత్రపిండాల వైఫల్యంతో డయాలసిస్ తీసుకుంటున్నవారిలో హృదయ సంబంధ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటివారు చేప నూనె సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా.. గుండె జబ్బుల ప్రమాదం 43 శాతం తగ్గినట్లు న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది. గుండెపోటు, స్ట్రోక్, వాస్క్యులర్ సమస్యలను తగ్గించే సుగుణాలు.. ఫిష్ ఆయిల్‌లో ఉన్నట్లు తేల్చింది. ఇక చేప నూనె సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా..

మధుమేహం నియంత్రణలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడంలో ఇవి సాయపడతాయి. చేప నూనెలోని ఔషధ గుణాలు.. మెదడు అభివృద్ధి, పనితీరును మెరుగుపరుస్తాయి. బాధ, అసంతృప్తి,

భయం, అసహనం, ఉద్రిక్తత లాంటి మానసిక లక్షణాలను తగ్గిస్తాయి. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ.. కీళ్లు, ఎముకలు బలహీనపడతాయి. నొప్పికి గురవుతాయి. ఇలాంటి సందర్భంలో ఆరోగ్యకరమైన చేప నూనెలను తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఆస్టియో ఆర్థరైటిస్ నొప్పులు, సమస్యలను ఫిష్ ఆయిల్ సప్లిమెంటేషన్ తగ్గిస్తుందని చెబుతున్నారు.

# పదును తగ్గితే.. పెదవికి చేటు



పదాలు పలికే పెదాలు గులాబీరేకుల్లా మెరిసిపోతే అతివ అందం రెట్టింపు అవుతుంది. మోవిపై చిరునవ్వులు ఎప్పుడూ నిలవాలంటే అధరాలను ఆక్రమించే పిగ్మెంటేషన్‌ను ఆమడ దూరం ఉంచాల్సిందే. పలువలువ పదును తగ్గించి, కళావిహీనంగా మార్చే పిగ్మెంటేషన్‌ను ఛేదించినప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయి. లిప్‌స్టిక్స్‌తో రంగులద్ది హంగులు చేరుస్తామంటే పెదవికి చేటు తప్పదు. ఇన్‌ఫెక్షన్లు పలకరించే ప్రమాదం ఉంటుంది. అలా కావొద్దంటే.. మధువులొలకబోసే పెదాల ఆరోగ్యం కోసం ఈ సలహాలు పాటించండి. విటమిన్ బి12, విటమిన్ డి లోపాల కారణంగానే పెదాలపై పిగ్మెంటేషన్ పెరుగుతుంది. ఇక విటమిన్ డి లోపం మొత్తం చర్మ రంగుని ఎఫెక్ట్ చేస్తుంది. బి12 తగ్గినప్పుడు మెలనిన్ సైతం పెరిగే ప్రమాదం ఉంది. దీంతో పెదాలను రెగ్యులర్‌గా నాలుకతో తడుపుకోవడం చేయాల్సి వస్తుంది. ఇలా చేయడం వల్ల అధరాలపై ఉన్న చర్మం పొర సహజత్వం విచ్ఛిన్నమవుతుంది. ఫలితంగా పెదాలు పొడిబారుతుంటాయి.

తడి తగ్గిందని తరచూ నాలుకతో తడమడం వల్ల.. సమస్య పెరుగుతుందే కానీ, తగ్గదు. దీన్నే లిప్ లిక్కర్స్ డెర్మటైటిస్ అంటారు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే.. కెమికల్స్ లేని లిప్‌బామ్ పెదాలకు అప్లయ్ చేస్తూ ఉండాలి. నీరు సమృద్ధిగా తీసుకోవాలి. శరీరం హైడ్రేటెడ్‌గా ఉన్నప్పుడే పెదాలూ ఆరోగ్యంగా ఉంటాయి. అప్పుడు పెదాలు పగలవు, వాటిని నాలుకతో తడమాల్సిన పనీ రాదు. విటమిన్ బి12 సమృద్ధిగా ఉండే పదార్థాలకు మీ డైట్‌లో చోటివ్వండి. విటమిన్ డి కోసం ఉదయం ఎండలో కాసేపు గడపండి. ఇక నాణ్యమైన లిప్‌స్టిక్స్ మాత్రమే వాడాలి. సమస్య తీవ్రంగా ఉందనిపిస్తే సంబంధిత వైద్యుణ్ని సంప్రదించండి.

# కరివేపాకును కాపాడుకుందాం




వాతావరణ మార్పులు మొకలకు సవాల్‌గా మారుతాయి. చలికాలంలోనైతే తగినంత సూర్యరశ్మి అందకపోవడంతో మొకలు త్వరగా వాడిపోతాయి. ఇలా వాడిపోయే మొక్కల్లో కరివేపాకు ఒకటి. ఇది చలికాలంలోఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంది.ప్రతి ఇంట్లో ఉండే కరివేపాకు మొకను ఎలా రక్షించుకోవాలో తెలుసుకుందాం.. సూర్యరశ్మి లేకపోవడం వల్ల కరివేపాకు మొకలో ఎదుగుదల లోపిస్తుంది. నిరంతరం నీడలో ఉండటం మూలంగా దాని ఆకులు బలహీనంగా, పసుపు రంగులోకి మారి రాలిపోతుంటాయి. మొక్కలపై తక్కువ సూర్యరశ్మి వస్తున్నట్లయితే వెంటనే అలర్ట్ అవ్వండి. రోజులో కనీసం 5-6 గంటలు.. వాటికి సూర్యరశ్మి లభించేలా చూడండి. అప్పుడే మొక్కలో కొత్త ఎనర్జీ పుట్టుకొస్తుంది. ఇక నీరు పెట్టే విషయంలోనూ చాలా జాగ్రత్తగా ఉండాలి. నీరు పెట్టేముందు మట్టిని తనిఖీ చేసి.. నేల పొడిగా ఉన్నప్పుడే నీళ్లు పెట్టండి. నీరు ఎక్కువగా పెడితే.. మొక బలహీనపడి కుంగిపోతుంది. పోషకాలు ఎకువగా ఉంటే.. కరివేపాకు మొక్కలు బాగా పెరుగుతాయి. ఆవు పేడ (ఎండినది) లేదా వర్మీ కంపోస్ట్‌ను కలిపిన మట్టిని వాడటం వల్ల.. మొక్కలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి. ఇక రసాయన మందులకు దూరంగా ఉండేలా..ఇంట్లోనే సేంద్రియఎరువులు తయారుచేసుకోవచ్చు. ఇందు కోసం.. బియ్యాన్ని తేలికగా రుబ్బి నీటిలో నానబెట్టాలి. ఆ నీటిని వడకట్టి బియ్యాన్ని ఒక కంటైనర్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని కరివేపాకు మొకలకు ఎరువుగా వాడొచ్చు. పులియబెట్టిన మజ్జిగ, ఎండబెట్టిన వేపాకు కూడా కరివేపాకు మొక్క ఎదుగుదలలో ఉపకరిస్తాయి.

# మరో హిందీ మూవీలో తమన్నా




తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనా లు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

# 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో'.. అదిరిపోయిన అడివి శేష్ 'డెకాయిట్' టీజర్




టాలీవుడ్ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఒక ప్రేమ కథ అనేది ఉపశీర్షిక. ఈ ప్రాజెక్ట్ ద్వారా షానీల్ డియో అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం సినిమా టీజర్‌ను విడుదల చేసింది. నాగార్జున సినిమాలోని ఐకానిక్ సాంగ్ 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో' బ్యాక్‌గ్రౌండ్ పాటతో ఈ టీజర్ మొదలవ్వగా.. ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ టీజర్ సాగింది. ఇందులో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ దొంగలుగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.


# నాగబంధం క్లైమాక్స్ కోసమే అన్ని కోట్లా..?



టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు తెరకెక్కించి వన్ ఆఫ్ దిలీడింగ్ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్‌గా నిలిచిన వారిలో ఒకరు అభిషేక్ నామా. డెవిల్ తర్వాత ఈ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ నుంచి వస్తున్న చిత్రం నాగబంధం. అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణల స్ఫూర్తిగా వస్తోన్న ఈ చిత్రంలో పెదకాపు సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన విరాట్ కర్ణ లీడ్ రోల్‌లో నటిస్తు న్నాడు. ఈ మూవీ క్లైమాక్స్ ఇదివరకెన్నడూ లేని విధంగా చిత్రీకరిస్తు న్నారట. తాజా టాక్ ప్రకారం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ రామానాయుడు స్టూడియోస్‌లో నిర్మించిన అద్భుతమైన మైథలాజికల్ సెట్‌లో క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నారు. ఈ సీక్వెన్స్ కోసం ఏకంగారూ. 20కోట్లు ఖర్చు చేస్తున్నారంటే విజువల్స్ ఏరేంజ్‌లో ఉండబోతు న్నాయో అర్థం చేసుకోవచ్చు. గ్లోబల్ యాక్షన్ అడ్వెంచరస్ కొరియో గ్రఫర్‌ఈ హై ఆక్టేన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నట్టు సమా చారం. ఈ చిత్రంలో ఇస్మార్ట్ భామ నభానటేశ్, ఐశ్వర్య మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్,తారక్ సి నిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి,లక్ష్మి ఐరాసం యుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ స్టోరీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్‌చేశారు మేకర్స్.

# "నా రూమ్‌లో ఆత్మ కనిపించింది": కృతి శెట్టి

యువ కథానాయిక కృతి శెట్టి ఇటీవల ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెన్నులో వణుకు పుట్టించే అనుభవాన్ని పంచుకున్నారు. సినిమా షూటింగ్‌కు ఒక్క రోజు ముందు హెూటల్ రూమ్‌లో తనకూ, తన అమ్మకూ ఆత్మలాంటి ఆకారం కనిపించిందని పేర్కొన్నారు. ఈ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న కృతి శెట్టి, తరువాత వరుస సినిమాల్లో నటించినప్పటికీ పెద్ద విజయాలు అందుకోలేకపోయింది. దీంతో తమిళం,
మలయాళం రంగాల్లో అవకాశాలపై దృష్టి పెట్టిన ఆమె ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన వా వాతియర్ (తెలుగులో 'అన్నగారు వస్తారు') మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలో కృతి మాట్లాడుతూ.. అన్నగారు వస్తారు షూటింగ్‌కు ఒక రోజు ముందు నేను, మా అమ్మ హెూటల్‌లో ఉండగా ఆత్మ లాంటి ఆకారం కనిపించిందని చెప్పింది. వెంటనే లైట్ ఆన్ చేయగానే పెద్ద శబ్దంతో ఆ ఆకారం మాయమైందని చెప్పింది.



# 'డేవిడ్ రెడ్డి'లో చరణ్, శింబు గెస్ట్ రోల్స్‌పై స్పందించిన మంచు మనోజ్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, నటుడు శింబు అతిథి పాత్రల్లో కనిపించనున్నారంటూ గత కొన్ని రోజులుగా వస్తున్న ప్రచారానికి మనోజ్ తెరదించారు. ఆ వార్తల్లో నిజం లేదని, ఇప్పటివరకూ ఆ పాత్రల కోసం తాము ఎవరినీ సంప్రదించలేదని స్పష్టం చేశారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' తెరకెక్కుతోంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు మనోజ్ బదులిస్తూ.. "సినిమాలో అతిథి పాత్రలకు మంచి స్కోప్ ఉంది. కానీ, ఆ పాత్రల కోసం ఇంకా ఎవరినీ ఫైనల్ చేయలేదు. దానికి ఇంకా చాలా సమయం ఉంది. సమయం వచ్చినప్పుడు తప్పకుండా ఆ వివరాలు నేనే వెల్లడిస్తాను" అని వివరించారు.ఈ సినిమాలో 'వార్ డాగ్' అనే ప్రత్యేకమైన బైక్ కీలక పాత్ర పోషిస్తుందని మనోజ్ తెలిపారు. ప్రభాస్ నటించిన 'కల్కి' చిత్రంలోని 'బుజ్జి' కారును రూపొందించిన బృందమే ఈ బైక్‌ను కూడా తయారు చేసిందని చెప్పారు. సుమారు 700 కేజీల బరువుండే ఈ బైక్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన అన్నారు. మనోజ్ సినీ పరిశ్రమలో 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టులో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రకటించారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

# తారాపథంలో తిరుగులేని విజయాలు



కథానాయికలు రష్మిక మందన్న, రుక్మిణి వసంత్ ఈ ఏడాది అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. సినిమాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని, రేటింగ్స్‌ను అందిస్తూ సినీ ప్రేమికుల అభిమానాన్ని పొందిన ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎండీబీ) సంస్థ ఈ ఏడాది భారతీయ సినిమాలో వివిధ కేటగిరీలలో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటులు, దర్శకుల జాబితాను విడుదల చేసింది. ఇందులో రష్మిక మందన్న, రుక్మిణి వసంత్ చోటు సంపాదించారు. రష్మిక మందన్న ఈ ఏడాది తిరుగులేని విజయాలను సాధించింది. ఆమె నటించిన 'ఛావా' 'థామా' 'కుబేర' 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఇక రుక్మిణి వసంత్ 'కాంతార చాప్టర్-1'తో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. దీనితో పాటు 'ఏస్' 'మదరాసి' చిత్రాలు సైతం ఈ భామకు మంచి గుర్తింపును తెచ్చాయి. ఇక ఐఎండీబీ జాబితాలో హిందీ చిత్రం 'సైయారా' జోడీ అహాన్ పాండే,అనీత్ పడ్డా తొలి రెండుస్థానాలను కైవసం చేసుకున్నారు. 40కోట్ల బడ్జెట్‌తో తీసిన 'సైయారా' బాక్సాఫీస్ వద్ద 400కోట్లకుపైగా వసూళ్లనుసాధించడం విశేషం.'కూలీ' చిత్రంలోఅతిథి పాత్రలో మెరిసిన అమీర్‌ఖాన్ మోస్ట్‌పాపులర్ యాక్టర్స్ జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. దర్శకులు మోహిత్ సూరి (సయారా), లోకేష్ కనకరాజ్ (కూలీ), అనురాగ్‌కశ్యప్ (నిశాంచి, బందర్) అత్యంత ప్రజాదరణ పొందిన దర్శకులుగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

# 1000 కోట్ల ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ చర్చ



భారీ బడ్జెట్, అత్యాధునిక సాంకేతికత, భారీ విజువల్స్ .. ఈ మూడు పదాలు చెప్పగానే గుర్తుకు వచ్చే పేరు దర్శకుడు శంకర్. 'జెంటిల్‌మన్' నుండి 'రోబో' వరకు భారతీయ సినిమాకు కొత్త దారులు చూపించిన ఈ మెగా డైరెక్టర్ ఈ మధ్య కాలంలో అనుకున్న స్థాయి ఫలితాలు అందుకోకపోవడంతో విమర్శల పాలయ్యారు. '2.0'కి వచ్చిన మిక్స్ రెస్పాన్స్, ఆ తర్వాత 'ఇండియన్ 2', 'గేమ్ ఛేంజర్' డిజాస్టర్ ఫలితాలు శంకర్ ప్రతిష్టను గణనీయంగా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో ఆయన తీసుకునే ప్రతి నిర?యం నిర్మాతలలో ఆందోళన కలిగిస్తోంది.
తాజాగా జరిగిన ఓ ఈవెంట్‌లో శంకర్ చేసిన కీలక ప్రకటన ఇప్పుడు తమిళ-తెలుగు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ప్రముఖ రచయిత సు.వెంకటేశన్ రాసిన నవల వేల్పారి ఆధారంగా భారీ సినిమా తీయబోతున్నట్లు ఆయన తెలిపారు.
ఏకంగా లక్షకు పైగా కాపీలు అమ్ముడైన చారిత్రక నవల 'వేల్పారి'. దీనిపై సినిమా అంటే అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' స్థాయి టెక్నాలజీని ఈ సినిమాలో ఉపయోగిస్తాను అని శంకర్ వెల్లడించారు. దీంతో ఈ సినిమా బడ్జెట్ రూ.1000 కోట్లకు పైగానే ఉండే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. శంకర్ భారీ బడ్జెట్, షూటింగ్ ఆలస్యం, ఎక్కువ ఖర్చులు నిర్మాతలకు భయానకంగా మారింది. 'ఇండియన్ 2' ఆలస్యం వల్ల లైకా ప్రొడక్షన్స్ భారీ నష్టాలు వచ్చాయి.
'గేమ్ ఛేంజర్' తో దిల్ రాజుకు భారీ ఒత్తిడి నెలకొంది. ఇలాంటి సమయంలో 1000 కోట్ల చారిత్రక చిత్రం తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు? ఈ స్థాయి సినిమాకు స్టార్ హీరో డేట్స్ ఇస్తారా ? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కాన్సెప్ట్ స్టేజ్ లో ఉందనే సమాచారం. ప్రొడ్యూసర్, స్టార్ కాస్ట్, షూటింగ్ ప్లాన్‌పై ఎలాంటి క్లారిటీ లేదు.
ఒకవేళ ఇది నిజంగానే పట్టాలెక్కితే శంకర్ కెరీర్‌కు తిరుగులేని రీఎంట్రీ కావొచ్చు ఇది కూడా శంకర్ డ్రీమ్ ప్రాజెక్టుల జాబితాలోనే నిలిచిపోవచ్చు. 'రోబో' తర్వాత శంకర్ సినిమాల్లో ప్రేక్షకులు కోరుకున్న మ్యాజిక్, ఎమోషన్, గ్రాండ్ విజన్ కనిపించలేదనేది సినీ విమర్శకుల అభిప్రాయం. ఇప్పుడు 'వేల్పారి'తో ఆయన మళ్లీ తన పాత ఫామ్ అందుకుంటారా లేదా అన్నది చూడాలి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215